నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 6-6-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:238 పేజీలు:6 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

వ్యాపారం నేడు
నిస్వార్థ సేవనాడు
నీతి పతనం.

గ్రీష్మ కృపాణం
సర్వప్రాణి సంకటం
వర్షపు దాలు.

ఓట్ల దారులు
బిక్షాటన రథాలు
కంచి కథలు

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజాయి

బీ ఆర్ ఎస్ మెంబర్లను
మింగె పెద్ద పాము !
శూన్యంలో చేయకండి
నేల విడిచి సాము ?

నెత్తిమీద పెట్టుకోని
నడుస్తుంటె ఎలా ?
కళ్ళెక్కడ అనుకోదా
కాళ్ళ కింది నేల ?

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

ప్రధాని పదవికి మోదీ రాజీనామా- కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు వీలుగా రిజైన్

న్యూఢిల్లీ, జూన్ 5 :ప్రధాని మోదీ తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను బుధవారం మధ్యాహ్నం రాష్ట్రపతి ముర్ముకు స్వయంగా అందజేశారు. వెంటనే అమోదించిన రాష్ట్రపతి కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయ్యే దాకా ఆపధర్మ ప్రధానిగా ఉండాలని ఆదేశించారు. కాగా, ఎన్డీఏ కూటమి ఈ ఎన్నికల్లో విజయం సాధించి మరోసారి కేంద్రంలో పగ్గాలు చేపట్టనుంది. ఇక.. ఎన్డీఏ కూటమి రేపు తమ నేతను ఎన్నుకోవడానికి సన్నాహాలు చేస్తోంది.

చంద్రబాబు, పవన్‌లకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు

హైదరాబాద్, జూన్ 5 :ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ట్విట్టర్ వేదికగా స్పందించారు. ఏపీ ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లకు ఆయన అభినందనలు తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగిస్తూ సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధి పథంలో పయనిద్దాం అన్నారు.

బీజేపీ గెలుపు కోసం బీఆర్ఎస్ బలిదానం.. రేవంత్ రెడ్డి

-8 సీట్లలో విజయం కోసం బీజేపీకి కారు సాయం
-లోక్ సభ ఎన్నికలలో మరోసారి ఏకమైన కారు, కమలం
-ఆరు నెలల తమ పాలనను మెచ్చిన జనం
-అందుకే తామే ఎనిమిది సీట్లు గెలిచాం
-లోక్ సభ ఫలితాల తర్వాత రేవంత్ రెడ్డి కామెంట్స్

హైదరాబాద్, జూన్ 5 :బీజేపీని గెలిపించేందుకు బీఆర్ఎస్ బలిదానం చేసుకుందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ... బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన నచ్చి లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు వేశారని, బీఆర్ఎస్ పార్టీకి మాత్రం గుండు సున్నా పెట్టారన్నారు. కనీసం రాష్ట్ర అవతరణ వేడుకలకు కూడా కేసీఆర్ హాజరు కాలేదని విమర్శిం చారు. కుటుంబం స్వార్థం, పార్టీ మనుగడ, ఆస్తులు కాపాడుకునేందుకు కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని, ఇప్పటికైనా అతని సరళిని మార్చుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ చేసిన కుట్రలతో కాంగ్రెస్ మిగతా 8 చోట్ల ఓడిపోయిందని వెల్లడించారు. కేసీఆర్ రాజకీయ జూదగాడని, కేసీఆర్ ఉన్నంతకాలం కుట్రలు ఉంటాయన్నారు.

ఇక ఇండియా కూటమిదే జోరు..

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచిన అందరికీ అభినందనలు తెలిపారు. ఎన్డీఏ కూటమికి ఇండియా కూటమే ప్రత్యామ్నాయమని రేవంత్ రెడ్డి వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల కంటే లోక్ సభ ఎన్నికల్లో ఓట్ల శాతం పెరిగిందన్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రతో దేశంలో పరిస్థితి మారిందన్నారు. మోదీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లారన్నారు. కాంగ్రెస్ పాలన నచ్చితేనే ఓటు వేయాలని ప్రజలను కోరామని సీఎం చెప్పారు.

కాంగ్రెస్ పాలనపై సంతృప్తి..

కాంగ్రెస్ పరిపాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో పందరోజుల్లో గ్యారంటీలను అమలు చేశామని, కాంగ్రెస్ పార్టీకి సంతోషకరమైన ఫలితాలు వచ్చాయన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 41శాతం ఓట్లు వచ్చాయన్నారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో మూడు స్థానాలు గెలిచిన కాంగ్రెస్ పార్టీ.. ఈ ఎన్నికల్లో 8 సీట్లు అధికంగా ఇచ్చి ప్రజలు ఆశీర్వదించారన్నారు. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి ఇండియా కూటమి సమానంగా పోటీ పడిందని చెప్పారు.

పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ పెద్దపీట- ఎమ్మెల్యే వంశీకృష్ణ

మహబూబ్‌నగర్, జూన్ 5 :పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. బుధవారం అచ్చంపేట పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మెగా సర్జికల్ క్యాంపును ప్రారంభించిన ఆయన స్వయంగా శస్త్ర చికిత్సలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఒక డాక్టర్‌గా, అచ్చంపేట నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఈ ప్రాంత ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో వుంటూ సేవలందిస్తుంటానన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదప్రజల ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట వేసిందన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్ఫూర్తితో అచ్చంపేట నియోజకవర్గంలోని పేద ప్రజల ఆర్థిక స్థితిగతుల దృష్ట్యా రాష్ట్రంలో ఎవ్వరూ, ఎక్కడా తలపెట్టని విధంగా మెగా సర్జికల్ క్యాంపును చేపట్టడం జరిగిందన్నారు.

రికార్డు స్థాయిలో 1230 మంది శస్త్రచికిత్సలకు ఎంపికకాగా, ఆపరేషన్ తీవ్రతను బట్టి దశల వారిగా ఆపరేషన్లు నిర్వహించుటకు ప్రణాళికా బద్దంగా ముందుకు వెళుతున్నామన్నారు.

ఈ మెగా క్యాంపులో జనరల్ సర్జన్లు రామచందర్, మహేశ్, బాలసింగ్, డాక్టర్ ఉదయ్, హరిత, అనెస్థిసియా డాక్టర్ ప్రభు, థియోటర్ ఇంచార్జి డాక్టర్లు శిరీష మొదలగు 20 మంది డాక్టర్లతో 4 టీములుగా శస్త్ర చికిత్సలు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు.

ప్రభుత్వ మెడికల్ కాలేజ్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్, జూన్ 5 :గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ నిర్మాణ పనులను ఇవాళ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరు చేయడం జరిగిందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో గద్వాల జిల్లాలో మెడికల్ కాలేజీ మంజూరు చేసుకోవడం జరిగిందని, దాదాపుగా మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు పూర్తి కావడం జరిగిందన్నారు. త్వరలోనే అన్ని రంగులతో అన్ని పరికరాలతో ప్రజలకు అందుబాటులో తీసుకువచ్చి త్వరలో మెడికల్ కాలేజీ ఆసుపత్రిని ప్రారంభించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఈ సంవత్సరం మెడికల్ కాలేజీలో అడ్మిషన్లు త్వరలోనే ప్రారంభం రావడం జరుగుతుందని, అదేవిధంగా తరగతులు కూడా ప్రారంభించి మెడికల్ విద్యార్థులకు అన్ని విధాలా సౌకర్యాలతో ఎలాంటి ఇబ్బంది లేకుండా మెడికల్ కాలేజీలో సౌకర్యాలను ఏర్పాటు చేసి పేద ప్రజలకు వైద్యం అందించే విధంగా తమ వంతు కృషిచేసి ప్రభుత్వ సహకారంతో కూడా అన్ని విధాలుగా మెడికల్ కాలేజ్ కి తన వంతు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథా లయ మాజీ ఛైర్మన్ జంబు రామన్ గౌడు, జిల్లా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు గడ్డం కృష్ణారెడ్డి, జి.వేణుగోపాల్, ఎంపీపీ విజయ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బాబర్, కౌన్సిలర్స్ మురళి, నాగిరెడ్డి, నరహరి శ్రీనివాసులు, దౌలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు అంగడి బసవరాజ్, మహబూబ్, నవీన్ రెడ్డి, భగీరథ వంశీ, కురుమన్న, మధు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కళలకు నిలయం గానసభ

గురువులను సన్మానిస్తున్న రమణాచారి.

హైదరాబాద్, జూన్ 5 : (నేటినిజం ప్రతినిధి): త్యాగరాయ గానసభలోని నాలుగు వేదికల్లో కళా ప్రదర్శనలు, పలురంగాలలో ప్రముఖుల చిత్రపటాలు ఆడిటోరియంలో ఏర్పాటుతో గానసభ కళలకు నిలయంగా, కళామయంగా మారిందని ఐఏఎస్ విశ్రాంత అధికారి డా॥ కె.వి.రమణాచారి అన్నారు. ఎందరో మహానుభావుల పేరిట గత కాలపు ప్రఖ్యాతులను స్మరిస్తూ చేస్తున్న కార్యక్రమాలు అద్వితీయమన్నారు. గానసభ వ్యవస్థాపక దినోత్సవం రెండవ రోజు కార్యక్రమం మంగళవారం జరిగింది. గానసభ నాట్యగురువు తులసి శిష్యబృందంచే కూచిపూడి నాటప్రదర్శన, సంగీత గురువు సుష్మ బృందం గానపోష్టి ఆకట్టుకుంది. అధ్యక్షత వహించిన గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి మాట్లాడుతూ గుండవరపు హనుమంతరావు సహకారంతో గానసభ నిర్మాణం జరిగిందన్నారు. తొలిప్రదర్శన గానసభలో ఇచ్చి దేశవిదేశాల్లో ప్రదర్శనలకు వివిధ రంగాల వారు వెళ్ళేవారన్నారు.శ్రీనివాస్, ఉష పాల్గొన్నారు.

లోక్ సభ ఎన్నికల్లో బిజెపి ఘన విజయం..మోదీ విజయం

-రిజర్వేషన్ల అంశం పేరుతో ఫేక్ వీడియోలతో చేసిన కుట్రలను తిప్పికొట్టారు
- దేశవ్యాప్తంతో పాటు తెలంగాణలోనూ కాంగ్రెస్ ను ప్రజలు నమ్మలేదు.
-ఆరు నెలల్లోనే రేవంత్ ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం పోయింది.
-పార్లమెంట్ ఎన్నికలు రెఫరెండమ్ అన్న సీఎం ఇప్పుడు ఏమంటారు.
-లోక్ సభ ఎన్నికల్లో బీజేపీని ఆశీర్వాదించిన ప్రజలకు ధన్యవాదాలు.
-తెలంగాణలో భవిష్యత్ భారతీయ జనతాపార్టీదే.
-బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి,

హైదరాబాద్ జూన్ 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్);తెలంగాణ ప్రజలే కాదు, యావత్ దేశ ప్రజలు ప్రధాని మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని లోకసభ ఎన్నికల ఫలితాలు రుజువు చేశాయని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. బిజెపి విజయం మోదీ విజయం, ఇది మోదీ సమర్థ నాయకత్వానికి పడిన ఓట్లని తెలిపారు. తెలంగాణలో బిజెపి పెరుగుదల స్పష్టంగా కనిపిస్తోందని..2014లో ఒక ఎంపీ సీటు, 2019లో నాలుగు సీట్లు 2024 ఇపుడు 8 సీట్లు గెలిచామంటే ప్రధాని మోదీ చరిష్మా వల్లేనన్నారు. ఇక వచ్చే ఎన్నికల్లో బిజెపి క్లీన్ స్వీప్ చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బిజెపి మళ్లీ గెలిస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తుందని, కేంద్ర మంత్రి అమిత్ షా మాట్లాడినట్లు వీడియో మార్ఫింగ్ చేసిన కాంగ్రెస్ కుట్రలను ప్రజలు తిప్పికొడుతూ ఆ పార్టీకి బుద్ధిచెప్పారన్నారు. తెలంగాణలోనూ ఎన్ని జిమ్మిక్కులు చేసిన వారి చెప్పిన సీట్లు కంటే తక్కువే గెలిచారని తెలిపారు.స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఎన్నికలు రాష్ట్ర ప్రభుత్వ పాలనకు రెఫరెడమ్ అని అన్నారు. 14 సీట్లలో గెలుస్తామని చెప్పారు. ఇప్పుడు 8 సీట్లకే వారిని ప్రజలు పరిమితం చేశారు. అంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై ఆరు నెలల్లోనే ప్రజలకు విశ్వాసం పోయిందని తేలిందన్నారు. నిజంగా ఈ ఫలితాలు రాష్ట్ర ప్రభుత్వ పాలనకు రెఫరెడమేనని తెలిపారు. 16 సీట్లలో కాంగ్రెస్ దాదాపు వెయ్యి కోట్ల వరకు ఖర్చు చేసినప్పటికీ భంగపాటు తప్పలేదన్నారు, ఈ ఫలితాలు చూస్తే తెలంగాణలో కాంగ్రెసుకు కౌంట్ డౌన్ మొదలైందని స్పష్టమౌతోందని ఏలేటి తెలిపారు. ఇక గౌరవ ప్రధాని నరేంద్రమోడీగారిని మూడో సారి ప్రధానిని చేయాలన్న ఆకాంక్షతో బీజేపీని ఆశీర్వాదించినందుకు ప్రజలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో 35శాతం ఓటు బ్యాంకు అందించిన రాష్ట్ర ప్రజలందరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదలు తెలుపుతున్నామన్నారు బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి.

ఎన్ డిఎతోనే టిడిపి ప్రయాణం: క్లారిటీ ఇచ్చిన చంద్రబాబు

విశాఖపట్నం జూన్ 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: కేంద్రంలో ఎవరికి మద్దతు ఇస్తారనే విషయంపై టిడిపి అధినేత చంద్రబాబు క్లారిటీ ఇచ్చారు. బుధవారం ఉండవల్లిలో చంద్రబాబు మీడియాతో మాట్లాడారు.

రాజకీయాల్లో తనకు ఎంతో అనుభవం ఉందని, ఎన్నో రాజకీయ మార్పులను చూశానని, ఇప్పుడు ఎన్ డిఎతోనే టిడిపి ప్రయాణం చేస్తుందని వివరణ ఇచ్చారు. ఇవాళ కూటమి మీటింగ్‌కు ఢిల్లీ వెళ్తున్నానని, ఆ తర్వాత ఏమైనా మార్పులుంటే మీకు తప్పకుండా చెప్తానని చంద్రబాబు పేర్కొన్నారు.కూటమి ఘనవిజయంపై ప్రజలకు మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. మీడియాతో సహా రాష్ట్ర ప్రజలందరికీ ధన్యవాదాలు చెప్పారు.

ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మీడియాతో మాట్లాడారు. శిరస్సు వంచి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నానని, తన సుదీర్ఘ రాజకీయ యాత్రలో ఈ ఐదేళ్లు చూసిన ప్రభుత్వాన్ని తాను ఎప్పుడూ చూడలేదని, ప్రజాస్వామ్య వ్యవస్థలన్నీ ఎలా ఇబ్బంది పడ్డాయో చూశామన్నారు. ప్రజలు గెలవాలి రాష్ట్రం నిలబడాలన్నదే తమ ధ్యేయమన్నారు.ఎన్ని త్యాగాలు చేసైనా భావితరాల భవిష్యత్తు కోసం ముందుకెళ్లామని, రాజకీయాల్లో ఎవరూ శాశ్వతం కాదని, దేశం ప్రజాస్వామ్యం, రాజకీయ పార్టీలు శాశ్వతమని బాబు స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు కూడా సక్రమంగా పని చేస్తే మళ్లీ ప్రజలు ఆదరిస్తారని, ఇంత చరిత్రాత్మకమైన ఎన్నికలు ఎప్పుడూ చూడలేదని, ఎక్కడో అమెరికాలో ఉండే వ్యక్తి కూడా తపనతో వచ్చి పని చేశారని, పక్క రాష్ట్రాల్లో కూలీ పనులకు వెళ్లిన వ్యక్తులు కూడా వచ్చి ఓటు వేశారని, తెలుగు దేశం పార్టీ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఎన్నిక ఇది అని ఆయన కొనియాడారు.

1983లో ఎన్‌టిఆర్ పార్టీ పెట్టినప్పుడు టిడిపి 200 సీట్లు వచ్చాయని, మళీ ఇవాళ ఊహించనివిధంగా ఫలితాలు వచ్చాయని, ప్రజాస్వామ్యంలో ప్రాథమిక హక్కు మాట్లాడే స్వేచ్ఛ ఉండాలన్నారు.

మావోయిస్టులపై ప్రజల తిరుగుబాటు.. 4వేల మందితో ర్యాలీ

వరంగల్, జూన్ 5 : అటవీ ప్రాంతంలో మందు పాత్రలు పెడుతూ సామాన్యులను బలిగొంటున్న మావోయిస్టులపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది. ఇటీవల ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని కొంగల అటవీ ప్రాంతంలో మావోయిస్టులు పెట్టిన మందు పాతర పేలి మృతిచెందిన ఇల్లందుల యేసు కుటుంబానికి మద్దతుగా వాజేడు వెంకటాపురం మండలాల నుండి గ్రామ గ్రామాన ప్రజలు కదిలి వచ్చి మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. జగన్నాధపురం గ్రామంలో వై జంక్షన్ నుండి హనుమాన్ సెంటర్ వరకు 4000 మందితో భారీ ర్యాలీ నిర్వహించారు.

ఈర్యాలీలో మావోయిస్టులకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు. ప్రజల కోసం పోరాటాలు చేసే మావోయిస్టులు నేడు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని వారు నినాదాలు చేశారు. మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలుడు కారణంగా మృతిచెందిన యేసు కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఘర్‌వాల్ పర్వతాల్లో చిక్కుకున్న 19 మంది ట్రెక్కర్లు, నలుగురు మృతి

న్యూఢిల్లీ, జూన్ 5 : ఉత్తరాఖండ్ పర్వత శ్రేణుల్లో బెంగుళూరుకు చెందిన నలుగురు ట్రెక్కర్లు మృతి చెందారు. మరో 19 మంది ఆ కొండల్లోనే చిక్కుకున్నారు. ఘర్‌వాల్ పర్వత శ్రేణుల్లో ఉన్న సహస్ర తాల్ మయాలీ మార్గంలో పర్వతారోహకులు ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో ట్రెక్కర్లు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. చిక్కుకున్న వారిని రెస్క్యూ చేసేందుకు కర్నాటక సర్కారు ఉత్తరాఖండ్‌కు ఆఫీసర్‌ను పంపింది. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ దళాలు ప్రస్తుతం రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. ఇప్పటికే ఆరుగుర్ని రక్షించారు. మంచు, వర్షం ఎక్కువగా కురుస్తున్న కారణంగా.. విజిబులిటీ క్షీణించిందని, అందుకే హెలికాప్టర్లతో జరుగుతున్న రెస్క్యూ ఆపరేషన్ నిదానంగా సాగుతున్నట్లు తెలిపారు.

ప్రేమ కిరీటాలు ధరించండి

–మహాకవి డా॥ కత్తి పద్మారావు
9849741695

సూర్యుడు భగభగ మండుతున్నాడు.
సముద్ర గర్భంలో కూడా అగ్నిశిఖలు.
ఎండ తాకిడికి
ప్రజలు విగతజీవులు అవుతున్నాయి.
శ్వాసలో కూడా వేడి ఆవిర్లు వస్తున్నాయి.
రోడ్లపై తారు మరిగి
చరణాలకు ప్రణాలవుతున్నాయి.
పట్టాలు సంకోచ వ్యాకోచాలకు గురై
రైళ్లు ప్రక్కకు ఒరుగుతున్నాయి.
ఆ పక్షి గూటిలోని చెత్త వేడెక్కి
పసికందులు అల్లాడుతున్నాయి.
కప్పులు లేని ఇళ్లల్లోని వృద్ధులు
పండుటాకుల్లా రాలుతున్నారు.
జీవిత గమనానికి
సూర్యతాపం ముగింపు పలుకుతుంది.
నిజమే!
గుడిలోని దేవుళ్లకు మాత్రం
రక్షణ కవచం!
రాతి బొమ్మలకున్న గూడు, నీడ
మనిషికి లేదు!
మనిషి తన గోతిని తానే తవ్వుకుంటున్నాడా?!
పెద్ద వృక్షాలు నరికి
క్రోటన్ మొక్కలు పెంచుతున్నాడు.
జలసంపదతో నిండిన
చెరువులు పూడ్చి
బహు అంతస్తులు నిర్మిస్తున్నాడు.
పట్టణాల్లో ప్రజలకు రాను రానూ
ఆక్సిజన్ తగ్గుతుంది!
విద్యుత్ దీపాల మధ్యలో
వేడి సెగలు.
నీటిని, గాలిని విషయుక్తం చేశాక
మనుషులకు మనుగడేది?
గుండె దీపాలు ఆర్పుకున్నాక
ఎన్ని దీపాలు వెలిగించినా ఏముంది?
ఇటు కొన్ని కృత్రిమ వినోదశాలలు.
వ్యామోహాల సెగలకు చల్లని పానీయ ధార
దేశం, కాలం, సమయం
అక్కడ లేవు
మనుషులు అక్కడ చిరుతపులు అవుతున్నారు.
జింకల్ని వేటాడుతున్నారు.
వేటలో ఆనందం
వేటకు గురవడంలోనూ రుస.
శరీరమంతా గాట్లు.
నెత్తుటి చుక్కలు.
ఏవో నాలుకలు ఆ చుక్కల్ని నాకుతున్నాయి.
ఆల్సేషన్ డాగ్‌లు
అక్కడ మనుషుల్ని వాసన చూస్తున్నాయి.
అదొక అగ్నికాసారం.
ఏవో కేరింతలు...కేరింతలు..
ఎవరు వీరు?
ఆ మహా చోరుల పిల్లలేనా?!
మరోపక్క ఆ విగ్రహ నిష్క్రమిని
మేళ తాళాల మధ్య ఊరేగిస్తున్నారు!
ఆ మోతకు నెయ్యాన్నాలు, పట్టు పీతాంబరాలు!
జీడిపప్పు మెదిపిన లడ్డు ప్రసాదాలు!
ఇక్కడ వీరు సడెండలో పనిచేస్తూ
దాహార్తితో మృత్యువాత!?
ఇద్దరిదీ ఈ దేశమే!
నిజమే! స్మగ్లర్లు హీరోలు అవుతున్నారు.
వీరు ఏ పాత్రలు సృష్టిస్తున్నారు?
ఎర్ర దుంగల దొంగల్నా?!
రాజ్యం కోసం తల్లిని చంపే కొడుకుల్నా?!
ఆ చార్లీ చాప్లిన్ 'డిక్టేటర్' గుర్తుందా?
గ్లోబును కాలితో తన్నుతూ
బంతాటాడుతూ ఆ నియంత!
తన తుపాకీతో తాను కాల్చుకోలేదా?
అందుకే ఇమ్మానియేల్ కాంట్
ఏం చెప్పాడు?
"జ్ఞానం శూన్యమైన మెదడుల్లో
ముళ్ళకంపలు పుడతాయని" అనలేదా?!
అందుకే డేనియల్ గోల్ మెన్
"డిస్ట్రక్షన్ ఆఫ్ ఎమోషనల్స్ "సృష్టించలేదా?
మీరు ఔషధ వనాలను తగులబెట్టి
విషగంధ వృక్షాలను పెంచుతున్నారు.
సుతుడికి బుద్ధే లేదు.
అతడి కోసం ఎంత సంపాదిస్తే ఏమిటి?
వారు జీవిస్తున్నారా?!
నడిస్తున్నారా?!
జీవితాన్ని రుచి చూసే సాహసం వారికి ఉందా?
జీవితం అంటే త్యాగం.
జీవితమంటే జ్ఞానం.
జీవితమంటే అనుభూతి.
జీవితమంటే కంటి తడి.
జీవితమంటే ద్రవించే హృదయం.
జీవితమంటే మండుతున్న విప్లవం.
జీవితమంటే ఆత్మీయత.
అలా జీవించిన వాడే
తన చూపుతో సూర్యుణ్ణి
కిందకు దించగలడు.
అతడి చూపుడు వేలు
కోట్ల సూర్యుళ్ళను సృష్టిస్తుంది.
ఆ తల్లి కన్నీరు తుడిచిన
ఆ రెండు వేళ్ళు చరిత్రకు గుర్తుగా నిలవలేదా?!
గుండెల్లో తడి లేని మనుషులు.
సమాజంలో చెమ్మ తగ్గిపోతుంది.
ఒక సజీవమైన అక్షర సృష్టి కోసం
మనిషి కరుణాసింధువు అవ్వాలి.
కీర్తి బుద్ధుడమైనది సుమా!
చర్య నిబద్ధమైనది.
రాజ్యాన్ని పదిలిపెట్టి ఆ గౌతముడు
బయటకు నడిచాక
చక్రవర్తులు జ్ఞాన బిక్ష కోసం
అతని వెంట పడలేదా?!
అతడు మోహ విహితుడై
స్ఫురద్రూపుడయ్యాడు.
ప్రేమ కిరీటాలు ధరించండి.
ఈ ప్రపంచం మీ వెనక నడుస్తుంది.
అదిగో ఆకాశమంత ఎత్తు నిలబడ్డ
ఆ ప్రేమ మూర్తే
ఈ యుగానికి దిక్సూచి.

చురక

మేజిక్ ఫిగర్ దాటని
మనోవ్యధ ముఖచిత్రం
పాలకులకు షాకిచ్చిన
ప్రజాతీర్పు బహుచిత్రం
మితిమీరిన అహంతోని
మిడిసిపడితే ఇదేగతే
నియంతృత్వ రూలింగు
నిలుపకపంటె అదోగతే

–వేల్పుల నారాయణ
9440433475

నేటి కందం– నేటికీ అందం

ధనవంతులతో జరిగిన
రణమున విజయంబు నిడిన రష్యన్ భాషన్
మునమున ముదమున దలచుచు
ఘనముగ పూజింపవలయు గర్వమ్మొప్పన్

(ప్రపంచ రష్యన్ భాషా దినోత్సవం)

–రాధశ్రీ
సెల్:9494481210

నేటినిజం
సాహితీ కిరణాలు
website:www.netinijam.com website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 6-6-2024

మదిలోని భావాలేవో...

గలగలపారే సెలయేరులా
మత్తకోయిల కూజితంలా
పురివిప్పిన నెమలి నాట్యంలో
కొలనులో విరిసిన కలువల్లా
మందువేసవిలో విరిసే మరుమల్లెల్లా
నోరూరించే తీయని నూజివీడు రసాల్లా
నల్లని కురిసే మేఘంలా
జలజల కురిసే వర్షంలా
భూమాత కౌగిలిలో ఒదిగే చినుకుల్లా
ఆకాశంలో విహరించే విహంగంలా
చల్లగ వీచే పిల్లగాలిలా
ఎత్తుకు ఎగిరే గాలిపటంలా
నీటిచెలమలో ఊరే ఊటలా
కడలిలో ఎగిసిపడే అలల్లా
నా మదిలో భావాలేవో ఊటలూరుతూ
తరంగాలై ఎగిసెగసి పడుతున్నాయి
కలంలోని సిరాను ఆసరాగా చేసుకుని
తెల్లని కాగితంపై నక్షత్రాలవోలె
మిలమిలా మెరిసిపోతున్నాయి
అక్షరాల విత్తుల మొలకలు
నా కనులముందు
నాట్యం చేస్తున్నాయి

-దేవలపల్లి సునంద
9291599562

ఘంటారవం

వాదోపవాదాలతో
వృథా చేయకు
సమయమే
సంపదని మరువకు.

పర్వతంలా
పరువు పెరగనీ
మంచులా
మనసు కరగనీ

ఎత్తుకు ఎదగగానే
ఎగిరెగిరి పడకు
ఒదిగి దిగివచ్చిన
గంగను మరువకు

మితిమీరిన మోహం
మోసానికి దాసోహం
గంధర్వుడి గాలంలో
వరూధిని విరహం

కాలం
మురిపిస్తుంది
గాయాన్ని
మరిపిస్తుంది

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

ఏడుకోలల బాయి

పేరైన గ్రూపుకు తీరైన దావతు
మెల్లగా పిలిపించి మెప్పుసేయు
రకరకాలైనట్టి రాతగాల్ల కొరకు
గుట్టుగా సరఫరా గూర్చిపెట్టు
కుల సంఘమును బిల్చి కులమునకొక్కింత
కులనేతలకు కొంత గట్టుగాను
పవరు గ్రూపుల బిల్చి క్లెవరుగామాట్లాడి
ఏదిస్తె మెరుగౌనొ ఎంచి చూసి.
అందరిని తృప్తి పరచుచు ఆదరమున
ఓట్లు కొల్లగా సాధించు ఫీట్లు చేసి
అన్ని గంపుల దరిచేరి పన్ని వలలు
ఎటులో! గెలవాలి అనువాడె ఎవ్వడైన.
మాయమాటల హామీల మర్మమెరిగి
గుర్తులేకుండ ఓటెట్ల గుద్దుతావు
ఓరి వెంకన్న! దోస్తుగా ఒర్లుబోతు!
ఒక్కమాటన్న వినవారా! తిక్కలోడ!

-డా॥ఏనుగు నరసింహారెడ్డి
8978869183

మనిషికి కవిత్వం ఒక ఉపశమనం
-బైస దేవదాస్

సమస్యల సుడిగుండంలో చిక్కుకున్న మనిషికి కవిత్వం ఉపశమనం ఇస్తుందని, అలాంటి కవిత్వం సమాజానికి అవసరమని బైస దేవదాసు అన్నారు.

తెలంగాణ రచయితల వేదిక కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో కర్షక్ బి ఇ డి కళాశాలలో జూన్ 1 న సిరిసిల్లా గఫూర్ శిక్షక్ రాసిన 'యుద్ధ గీతం' దీర్ఘ కవిత, ఎన్నీల ముచ్చట్లు కవితా సంకలనం 'కవన సమీరాలు' కాశనర్సయ్య రాసిన 'చిత్రాలకు పద్య రూపస్పందన' పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. ముఖ్య అతిథిగా నేటి నిజం సంపాదకులు బైస దేవదాస్ 'యుద్ధ గీతం' పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ కవిత్వం తరతరాలు జీవింపబడాలని సాహిత్యం మంచి సమాజం ఏర్పాటుకు దోహదపడుతుందని కవులు తమ రచనల ద్వారా సమాజంలోని చెడును తొలగించి మంచిని పెంపొందిస్తారని ఆయా పదవుల్లో వున్నవారు 'మాజీ'లవుతారు కానీ కవులు మాత్రం జీవించి వున్నంత కాలం కవిగానే గుర్తింపబడుతారని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అక్షరం పనిచేయాలని రచన ఏ ప్రక్రియ అయినప్పటికీ ఆ ప్రక్రియ ప్రజల పక్షమై ఉండాలని మానవ సంబంధాలను పెంపొందించడానికి మనిషి మనుగడకు మనిషిని మనిషిగా ప్రేమించే తత్వాన్ని పెంపొందించే రకంగా కవిత్వం రాయాలని అన్నారు

యుద్ధ గీతం దీర్ఘ కవిత రాసిన గఫూర్ శిక్షక్ ను పదేండ్ల క్రితం రాసిన ఆయన కవిత్వాన్ని చూసినప్పుడు ఈరోజు రాసిన కవిత్వాన్ని చూసినప్పుడు ఎంతో మెరుగైన కవిత్వాన్ని రాస్తున్నారు అని అన్నారు. గఫూర్ శిక్షక్ దేశంలో జరుగుతున్న అనేక సమస్యలను యుద్ధగీతం దీర్ఘ కవితలో తెలియజేశారన్నారు. పరిశీలన లేనిదే కవిత్వాన్ని రాయలేమని కవిత్వం అనేది ఒక ఊట బావి లాంటిదని ఈ సమాజాన్ని ఎప్పుడైతే పరిశీలించగలుగుతామో పూర్తిగా అర్థం చేసుకుంటామో తోటి మనిషి ఏ సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాడో తెలుసుకోవాలనే తపన మన గుండెలో కలిగినప్పుడు రాసే అక్షరాలు చైతన్యం కలిగించి ఆలోచింపజేస్తుందన్నారు. ఆ దిశగా గఫూర్ కవిత్వం వుందని అన్నారు.

కామారెడ్డిలో కొనసాగుతున్న ఎన్నీల ముచ్చట్లు ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనం కవితా సంపుటి కవన సమీరాలు పుస్తకాన్ని ఆవిష్కరించిన తెరవే రాష్ట్ర అధ్యక్షులు జి. లచ్చయ్య

కాశ నరసయ్య, అల్లి మోహన్ రాజ్ మంద పీతాంబర్ కాసర్ల రామచంద్రం కమలకాంత్ సుధాకర్ రామకృష్ణ దర్పల్లి సాయికుమార్ నాగభూషణం నవీన్ రెడ్డి కౌడి రవీందర్ డిసిసిబి డైరెక్టర్ ఇంద్రసేనారెడ్డి బిబిపేట వైస్ ఎంపీపీ రవీందర్ రెడ్డి, బానోత్ సురేష్ సాయి ప్రభాస్ గణేష్ రవీందర్ పలు ఉపాధ్యాయ సంఘాల సభ్యులు ఉపాధ్యాయులు సాహితీవేత్తలు సాహితీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

అనంతరం పుస్తక రచయితలు గఫూర్ శిక్షక్, కాశ నరసయ్య లను అతిథులు ఘనంగా సత్కరించారు.

సమస్యల సుడిగుండంలో చిక్కుకున్న మనిషికి కవిత్వం ఉపశమనం ఇస్తుందని, అలాంటి కవిత్వం సమాజానికి అవసరమని బైస దేవదాసు అన్నారు.

తెలంగాణ రచయితల వేదిక కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో కర్షక్ బి ఇ డి కళాశాలలో జూన్ 1 న సిరిసిల్లా గఫూర్ శిక్షక్ రాసిన 'యుద్ధ గీతం' దీర్ఘ కవిత, ఎన్నీల ముచ్చట్లు కవితా సంకలనం 'కవన సమీరాలు' కాశనర్సయ్య రాసిన 'చిత్రాలకు పద్య రూపస్పందన' పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. ముఖ్య అతిథిగా నేటి నిజం సంపాదకులు బైస దేవదాస్ 'యుద్ధ గీతం' పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ కవిత్వం తరతరాలు జీవింపబడాలని సాహిత్యం మంచి సమాజం ఏర్పాటుకు దోహదపడుతుందని కవులు తమ రచనల ద్వారా సమాజంలోని చెడును తొలగించి మంచిని పెంపొందిస్తారని ఆయా పదవుల్లో వున్నవారు 'మాజీ'లవుతారు కానీ కవులు మాత్రం జీవించి వున్నంత కాలం కవిగానే గుర్తింపబడుతారని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అక్షరం పనిచేయాలని రచన ఏ ప్రక్రియ అయినప్పటికీ ఆ ప్రక్రియ ప్రజల పక్షమై ఉండాలని మానవ సంబంధాలను పెంపొందించడానికి మనిషి మనుగడకు మనిషిని మనిషిగా ప్రేమించే తత్వాన్ని పెంపొందించే రకంగా కవిత్వం రాయాలని అన్నారు

యుద్ధ గీతం దీర్ఘ కవిత రాసిన గఫూర్ శిక్షక్ ను పదేండ్ల క్రితం రాసిన ఆయన కవిత్వాన్ని చూసినప్పుడు ఈరోజు రాసిన కవిత్వాన్ని చూసినప్పుడు ఎంతో మెరుగైన కవిత్వాన్ని రాస్తున్నారు అని అన్నారు. గఫూర్ శిక్షక్ దేశంలో జరుగుతున్న అనేక సమస్యలను యుద్ధగీతం దీర్ఘ కవితలో తెలియజేశారన్నారు. పరిశీలన లేనిదే కవిత్వాన్ని రాయలేమని కవిత్వం అనేది ఒక ఊట బావి లాంటిదని ఈ సమాజాన్ని ఎప్పుడైతే పరిశీలించగలుగుతామో పూర్తిగా అర్థం చేసుకుంటామో తోటి మనిషి ఏ సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాడో తెలుసుకోవాలనే తపన మన గుండెలో కలిగినప్పుడు రాసే అక్షరాలు చైతన్యం కలిగించి ఆలోచింపజేస్తుందన్నారు. ఆ దిశగా గఫూర్ కవిత్వం వుందని అన్నారు.

కామారెడ్డిలో కొనసాగుతున్న ఎన్నీల ముచ్చట్లు ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనం కవితా సంపుటి కవన సమీరాలు పుస్తకాన్ని ఆవిష్కరించిన తెరవే రాష్ట్ర అధ్యక్షులు సమూహ సభ్యులను కవన సమీరాలు పుస్తకంలో పాల్గొన్న కవులను అతిథులు సత్కరించారు

ఈ కార్యక్రమానికి ఎన్నీల ముచ్చట్లు సమన్వయకర్త యెనిశెట్టి గంగా ప్రసాద్ సభాధ్యక్షత వహించగా ప్రముఖ వ్యాఖ్యాత పబ్బ విజయశ్రీ మంచి వ్యాఖ్యానాన్ని అందించారు ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు పర్కపెల్లి యాదగిరి వంగర నరసింహారెడ్డి ప్రవంతి మహిపాల్ ప్రముఖ గజల్ కవి సూరారం శంకర్ కాలమిస్టు డాక్టర్ పుస్తకాలను సమీక్షించారు.

ఈ కార్యక్రమంలో 8 నిమిషాల్లో 100 పద్యాలను ధారాళంగా కంఠస్థం చేసి పఠనం చేసిన దోమకొండ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని భవాని పద్యాలను సభ ముందు చదివి వినిపించి అందరిని ఆశ్చర్యపరిచింది. బైస దేవదాసు ప్రత్యేకంగా భవానిని, విద్యార్థినిని తీర్చిదిద్దిన తెలుగు ఉపాధ్యాయిని ఉమను అభినందించారు.

రక్తదాతల సమూహం చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందిస్తూ రక్తదాతల సమూహ సభ్యులను కవన సమీరాలు పుస్తకంలో పాల్గొన్న కవులను అతిథులు సత్కరించారు

సిరిసిల్లా గఫూర్ శిక్షక్ రచించిన 'యుద్ధగీతం' దీర్ఘ కవితను ఆవిష్కరిస్తున్న బైస దేవదాసు

ఎన్నీల ముచ్చట్లు కవితా సంకలనం 'కవన సమీరాలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కొండి మల్లారెడ్డి

కాశనర్సయ్య రాసిన 'చిత్రాలకు పద్య రూపస్పందన' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సూరారం శంకర్.

పుస్తక సమీక్షలు

కాలానుగుణ చైతన్య కథల 'దాస్తాన్'

ఈమధ్య నా కవిత్వ సంపుటి ఆవిష్కరణ సందర్భంగా నస్రీన్ కథా సంపుటి "దాస్తాన్" - ముస్లిం మహిళల కథలు నా చేతికి అందింది. మరో రెండు రోజుల్లో నేను యూకే ప్రయాణం కడుతూ ఆ పుస్తకాన్ని కూడా నా బ్యాగ్ లో వేసుకున్నాను. మొదటి రోజు జెట్‌లాగ్ పోగానే కథలన్నీ ఏకబిగిన చది వేసిన. కథల నేపథ్యం ముస్లింలది. రచయిత్రి ముస్లిం. కానీ కథల భాషా మాధ్యమం తెలుగు. కథలు చదువుతున్నప్పుడు ఎక్కడా రచయిత్రి ముస్లిం అనే భావనరాదు. ఇంతకు పూర్వమే షాజహాన తెలుగు మాధ్యమంగా మంచి రచయిత్రిగా స్థిరపడ్డారు. నస్రీన్ ఖాన్ కూడా ఆ కోవలోకి చెందిన దని అర్థమవు తుంది.

ప్రతులకు:అన్నీక్షికి పబ్లికేషన్స్, నవ తెలంగాణ బుక్ హౌస్, గాంధీ బుక్ హౌస్-సుల్తాన్ బజార్, కోఠి. -ఆన్లైన్లో:అమెజాన్.

రచయిత్రి చెప్పుకున్నట్లు లాపతా కథ మినహా అన్ని కథలు ముస్లిం కుటుంబాలలోని అంతర్గత సమస్యలను వెలికి తీసినవే.

"ఏ ఏ నఫ్రిన్ ఇయాల పాన్ వేసుకున్నావా? "

" అరె సాజిద్! కలకత్తా పానేమోరా?"

" రమ్యా! నువ్వెప్పుడమ్మా పాన్ వేసుకునేది?"

" అరే అభీ! సఫ్రిన్ కు ఈసారి ఫైర్ పాన్ వేసుకోమనాలె. మస్తు ఉంటది మజా."

పై మాటలన్నీ సఫ్రిన్ రజస్వలయి, 13 రోజుల తర్వాత స్కూలుకు పోయినప్పుడు పక్క స్కూలు పోకిరి విద్యార్థులు సఫ్రిన్ ను ఉద్దేశించి మాట్లాడిన వెకిలి మాటలు. అది రోజువారి తతం గమై కూర్చుంది. దాంతో ఆ పసి మనసు గాయపడి కొంత డిప్రెషన్ కు లోనైంది. ఆడపిల్లలకు మెన్స్ట్రుయేషన్ జీవితంలో కొత్త మలుపు. మారుతున్న కాలంలో బహిర్గతం చేయాల్సిన అవసరం లేదనే విషయాన్ని పట్టించుకోకుండా దాదీమా చేసిన తతంగం పోకిరి వెధవలకు అవకాశం . కాలాను గుణంగా ఆడపిల్లలు ఇంటికే పరిమితం కాకుండా ఉన్న సంద ర్భంలో పాత ఆలోచనల్లో సంప్రదాయాల్లో మార్పు రావలసిన అవసరం ఉంది.. ఆ మార్పును పట్టించుకోకపోవడం వల్ల పిల్లలు ఎదుర్కొనే ఇబ్బందులు ప్రమాదా లకు దారి తీయవచ్చు. ఈ కథలో రచయిత్రి సమస్యను ప్రస్తావిస్తూనే పరిష్కారాన్ని చూపడం బాగుంది

" ఈ బానిస బతుకు నాకొద్దు." అనుకొని ససురాల్ ల ఇమడలేక పుట్టింటికి వచ్చిన ముంతాజ్ ను తల్లిదండ్రులు "తెలువక వచ్చింది బేటా! సంఝాయించిన. మల్ల ఇట్ల చేయదు. నేను మాటిస్తున్న" అని దామాదుకు హామీ ఇచ్చి పంపడంతో ముంతాజ్, తండ్రి మాటకు కట్టుబడి అష్ట కష్టాలు పడుతూ అత్తవారింట్లోనే ఉండిపోయింది. కానీ ముంతాజ్ చెల్లెలైన జైనబ్ భర్త అరాచకాలను సహించకుండా కోర్టుకెక్కడమే దిశ మార్చుకున్న గాలి కథ. అక్క చేయలేని సాహసాన్ని 10 సంవత్సరాలు చిన్నదైన చెల్లెలు చేయడంలో ఆ చెల్లెలు వ్యక్తిత్వంతో పాటు కాలానుగుణమైన చైతన్య కోణం కావచ్చు. సబబైన వ్యక్తిత్వాలతో రచయిత్రి కథనం చేసింది.

"నాకు చదవడానికి ఏవైనా పుస్తకాలు తీసుకురా" అన్న షహానా మాటలకు

"హే... పుస్తకాలు మనసులను పాడు చేస్తాయి. అవి చదవడం శుద్ధ దండగ" అన్నది సాదిఖ్ ఆలోచన

" పోనీ ఈ పనిమనుషులనైనా మాన్పించు. ఇంటి పనులు చేస్తుంటే నైనా మనసు నిమ్మళంగా ఉంటుంది." అని అడిగిన షహానా మాటలకు

"పిచ్చా నీకేమైనా!? బొత్తిగా లోకజ్ఞానం లేదు. పనోళ్లను పెట్టిం చమని భార్యలు గొడవలు పెట్టుకుం టారు." అన్నది సాదిఖ్ వాదన. పి.హెచ్.డి. చేయాలన్నది షహానా కోరిక.

"ఇంకేం చదువు. పి.జి చేశావు చాలదూ. నువ్విలా హాయిగా ఉంటేనే నాకు నచ్చుతుంది."

ఇది "పంఛీ బౌర్ పింజ్రా" కథలో భార్యాభర్తల సంభాషణ. ఆమె చైతన్యంతో చదువు సంధ్యలతో స్వేచ్ఛగా బతకాలని ఆలోచిస్తుంటే అతను ఆమె శ్రమకు విముక్తి కలిగించి మెదడును బంధించాల నుకున్నాడు. ఒకరకంగా అది హౌస్ అరెస్ట్. పక్షిని పంజరంలో బంధించినట్టే. తెలంగాణ ఉద్యమ కాలంలో సాగరహారంలో అతనికి చెప్పకుండా తర్వాత "చిన్న చిన్నాటికి నువ్వు షాపుకు పోతే నా ఇజ్జత్ ఏం కావాలె?", "నీకు సెల్ఫోన్ అవసరమేంది? జాబ్ మానేసినంక ఇంకెందుకు పలకరింపులు. ఎవరు ఫోన్ చేసినా మాట్లాడొద్దు. ఆ పోస్ట్ ఎందుకు పెట్టినవ్? వాడి పోస్ట్ కు లైక్ ఎందుకు కొట్టినవ్? " వంటి ఒత్తిళ్లతో విసిగెత్తిన ఫాతిమా భర్తతో వాదించి ఎదిరించ డానికి సిద్ధమై ఉద్యోగం చేయడానికి సన్నద్ధురాలవడం వంటి మలుపుతో స్త్రీలకు మంచి సందేశాన్నిచ్చింది రచయిత్రి.

తల్లిదండ్రులను చూసుకునే బాధ్యత, కొడుకే చూసుకుంటాడనే అపోహ సమాజంలో నాటుకొని ఉంది. కానీ ఎన్నో సంఘటనలు అది అబద్ధమని నిరూపిస్తా. తమ అవసరానికి తల్లిదండ్రులను వాడుకొని, వాళ్ల అవసరాన్ని నిర్లక్ష్యం చేయడం జరుగుతున్న తతంగమే. అట్టి సందర్భాల్లో కూతురు వాళ్లకి భరోసా ఇవ్వాలని ఆలోచించినా తెలివిగా అల్లుడు పక్కదారి పట్టించిన కథ భరోసా. ఈ కథ పితృ స్వామిక వ్యవస్థలో వృద్ధుల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడి అవుతున్న విషయాన్ని రచయిత్రి కళ్ళకు కట్టింది.

కలల కల్లోలం కథ కరోనా కాలపు పరిస్థితులను ఎంతో వివరంగా కథనం చేసినప్పటికీ ఇందులో హిందూ ముస్లింల ఐక్యతా రాగం కనపడుతుంది. అంతేకాదు ముస్లిం కుటుంబాల్లో స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలు హింసా కాండ ఇతర మతాల్లోనూ ఉంటుందన్న సత్యాన్ని రచయిత్రి వెలికి తీశారు.

"ధూప్ ఛావ్ , అర్థపురుష్" కథలు గతి తార్కికతకు సంబంధించినవి. "అర్థపురుష్" లో అత్త భర్త వల్ల, పెద్ద కుటుంబాన్ని పేదరికంలో నెట్టుకొచ్చిన కష్టం తాలూకు ప్రభావం కోడండ్లపై కసి తీర్చుకునే వ్యక్తిత్వాన్ని తీసుకొచ్చింది (అర్థపురుష్). తండ్రి తాగుబోతు తనం తల్లిని హింసించడం వంటి బాల్య సంఘటనలు ఆ స్త్రీకి జీవితంలో చొరవ లేకుండా చేశాయి. తల్లిదండ్రులు పిల్లల్ని పెంచాల్సిన విధానాన్ని సందేశంగా ఇచ్చిన కథ.

ఏ ఆలంబన లేని స్త్రీలను గమనించి పురుషులు లొంగదీసుకునే పరిస్థితులు సమాజంలో కోకొల్లలు. ఇంట్లో ఉన్నా, ఉద్యోగం చేసే చోటైనా పరిస్థితులను ప్రతిఘటించగలిగిన మహిళలు తప్ప మిగిలిన వారంతా మగవాళ్ళ వెకిలి చేష్టలతో భాధకు గురి ఔతూనే ఉంటారు. నస్రీన్ ఖాన్ "వియర్డ్" కథలో జబీన్ చందనల తొందరపాటే వారిని ఒంటరి మహిళలను చేసింది. అయితే వాళ్ళు ఎదుర్కొన్న మగ పిల్లల వెకిలి వేషాలు ఆయావృత్తుల్లో సహజంగా జరుగుతూ వస్తున్నవే. స్త్రీల పట్ల పురుషుడి ఆలోచన మారనం తవరకు వీటికి విముక్తి లేదనే గమనించాలి.

పై కథలన్నిటికన్నా "లాపతా" కథ ప్రత్యేకించి ముస్లింలకు సంబంధించినది. దేశంలో ఏ మూలలో ఏ గొడవ జరిగినా ముస్లింలనే బాధ్యులను చేయడం సీదా సాదాగా కొనసాగుతూనే ఉన్నది. ఆ విషయాన్ని అన్నెం పున్నెం ఎరుగని ఒక పసి బాలుడి పట్ల జరగడాన్ని రచయిత్రి న్యాయంగా సహజంగా చిత్రించింది. కానీ ఈ కథలో

"పిల్లల కోసం పనులు చేయాల ంటే ఎంత తన్మయత్వంలో మునిగిపోతారో ఈ తల్లులు. వాడిని ఇచ్చిన మొగుణ్ణి మటుకు పక్కనే ఉన్నా అస్సలు పట్టించుకోరు " అని భర్త అనుకునే స్థాయి రఫీఖాది. కానీ ఆ స్థాయి బయట ప్రపంచం గురించి తెలియక ముందు. అకారణంగా కొడుకును పోలీసులు ఎక్కడో జరిగిన అల్లర్లకు అరెస్టు చేసి దండించినప్పుడు బస్తీ వాసులంతా ఏకమై ధర్నా చేసి విడిపించుకున్న సందర్భంలో ఆమెకు బయటి ప్రపంచం గురించి కొంత తెలిసి వస్తుంది. తన కొడుకు ఇంటికి వచ్చినా మిగిలిన పిల్లల కోసం ఆమె యాతనపడి విడిపించుకోవాలని అనుకోవడం ఆ స్త్రీ లోని మానవ త్వం. ఒకరకంగా యూనివర్సల్ మాతృత్వం గల మహిళగా రచయిత్రి స్థిరపరిచింది .కథలను సాంతం చదివినపుడు "లాపతా" మినహా మిగిలిన అన్ని కథల్లోని సమస్యలు ఇంచుమించు ఇతర మతాల్లోని కుటుంబాలలో జరుగుతు న్నవే అనిపించింది ఒక్క బుర్ఖా విధానం తప్ప. అవి ఎక్కువ తక్కువలో తేడా ఉండొచ్చు.

కథలు చాలాపరకు కథనంలో సాగినై. దానివల్ల నవలల పోకడ కొంత కనపడుతున్నది. సంభాషణలు ఎక్కువగా ఉంటే పాఠకులకు అనుకూలం. "పంఛీ బౌర్ పింజ్రా" కథలో రచయిత్రి సాగరహారాన్ని మానవహారంగా పేర్కొన్నారు. ఈ ఒకటి రెండు సూచనలు మినహా కథలన్నీ చదివించే గుణం గలవే కాదు సందేశాత్మకమైనవి కూడా. నస్రీన్ ఖాన్ మరిన్ని మంచి కథలతో మరో పుస్తకం తెస్తారని ఆశిస్తూ అభినందిస్తూ ...

-తిరునగరి దేవకిదేవి
9949636515

చెమ్మగిల్లిన గుండె చిలికించిన గేయ కవిత్వం

"చెమ్మగిల్లిన గుండె"ను 108 విరహ, విషాద గీతాల రూపంలో ఆవిష్కరిస్తున్నారు డా॥ రాంకిషన్ గొల్లపెల్లి. ఈయన కలంపేరు రాఖీ, భక్తిగీతాలు, శతక రచనలు, ప్రేమ గీతాలు, వచన కవితలు, లఘు రూప కవితలు యిలా పలు ప్రక్రియల్లో రచనా వ్యాసంగం కొనసాగిస్తున్న రాఖీ యిప్పటికీ 2500పైగా గీతాలు, 200 పైగా కవితలు, లఘురూప కవితలు సృజించిన అనుభవజ్ఞుడు. అనేక ఆడియో ఆల్బమ్స్ విడుదల చేసిన నేపథ్యం రాఖీది.

-రమణ వెలమకన్ని
సెల్:9866015040.



ప్రతులకు: డా॥గొల్లపెల్లి రాంకిషన్ ఇ.నెం.3-217/1, రోడ్‌నెం.14 నార్త్, ప్రశాంతిహిల్స్, మీర్‌పేట్ హైదరాబాద్-500 097 సెల్: 94949 94896

రాఖీ తన గేయ కవిత్వంలో విరహ, విషాద గీతాలు వినిపించి పాఠకుల గుండెల్ని చెమ్మగిల్లజేస్తారు. గేయానికి, గీతానికి బేధం చాలా స్వల్ప ం. గేయ కవిత అంటే గాన యోగ్యమైనది. అంత్యప్రాసల ఆడంబరం గేయ కవితా లక్షణం. గేయాన్ని పల్లవి మరియు చరణంగా విభజిస్తే అది గీతమవుతుంది. గీతం సంగీత రచన లో చాలా ముఖ్యమైనది. దీనికి పల్లవి, అనుపల్లవి, చరణం అన్న భాగములు వుండవు.

గేయమన్నా.. గీతమన్నా రెండిటి అర్థం 'పాటే'. గేయమంటే పాడదగు నదనీ, గీతమంటే పలుకబడినదనీ నిఘంటువు తెలియజేస్తోంది.

రాఖీ తన గీతాలను విరహ, విషాద గీతాలుగా పేర్కొంటున్నారు. విరహమంటే ఎడబాటు లేదూ వియోగం. విషాదమంటే ఖేదము లేదా శోకము. రాఖీ గీత రచయితే కాదు.. మంచి గాయకుడు కూడా. ఆయన రాసిన పాటలకు ఆయనే స్వయంగా బాణీలను కట్టుకుని, స్వరాలను కూర్చుకుని శ్రోతలను ముగ్ధులను చేయగల నేర్పరి. తాను రాసిన అశేష గీతాలను పన్నెండు విషయాలుగా విభజించి పుస్తకాలుగా వెలువరించారు. అందులో ఓ భాగమే **'చెమ్మగిల్లిన గుండె'**. విరహ, విషాద గీతాల గ్రంథమన్న మాట.

కొన్ని గీత వంక్తులను గమనిద్దాం.

"రాధకెంత బాధనో మాధవుని రాకకై
మీరాకెంత తపననో గోవిందుని పొందుటకై
నది పరుగులు పెడుతుంది కడలి సంగమానికై
మది గుబులే తీరకుంది చెలీ నీ కలయికకై" ప్రియుడు, తన ప్రియురాలి ఎడబాటును శ్రీ కృష్ణుని ఎంతగా ఆరాధించినా ప్రియురాలు కరుణించలేదు. ఆమె హృదయం ఇనుమంతయినా కరగలేదు. ప్రియుడి పట్టుదల మాత్రం ఆమె జ్ఞాపకాలను తొలుస్తునే వుంది.

"చిలికి చిలికి చిరుగాలి వాన య్యింది
ఒలికి ఒలికి కన్నీరు ఏరయ్యింది
కరుగని నీ హృదయం శిలగా మారింది
వీడని నా పట్టుదలే ఉలిగా నిను తొలిచింది" అంత్య ప్రాసలు గేయం లో ఎంత అందంగా ఒదిగి నయ్యో గమనించండి.

"గుండెలలో రేగిన గాయం
మందులతో కాదు నయం
శిశిరమైన నా హృదయం
పొందదులే వాసంతం
కరిగిన కల కావేరై
నా కన్నీరే గోదారై
వరదల పాలయే జీవితం
సుడిలోపల చిక్కే భవితవ్యం"

గాయం రేగిందంటే గుండె చెమ్మగిల్లక మానదు. ఈ విషాదం దుఃఖ సముద్రంగా పోటెత్తి భవిష్యత్తు సుడిగుండాల పాలవుతుందని అంటున్నాడు కవి.

"ఇసుక తిన్నెలు అడుగుతున్నవి
చెలిజాడ ఏదని ఏమైందని
వెన్నెలమ్మా వెతుకుతున్నది
మన జంట ఆచూకి ఏదని
గోదావరి కంటనీరే కారి కారి ఇంకిపోయే
ఏకాకిగా మారినానని ఎదిగి నంతనే ఖిన్నయై" ఈ దుఃఖ ప్రకటనకు వేరే వ్యాఖ్యానం అఖర్లేదు.

"మనసే మనిషికీ ఒక వరము
ప్రేమే మనిషికీ సర్వము
ఆ ప్రేమే చెదిరిన నాడు ఆ మనసే రగిలిననాడు
జీవితమే ఒక శాపము-బ్రతుకే సంతాపము" వేదనలోంచే వేదాంతం ఒలుకుతుంది. తత్వం బోధపడ్తుంది.

ఒకటా.. రెండా.. శతాధిక గేయాలతో రాఖీ ఒంపిన విరహ, విషాద అభివ్యక్తులు ఆస్వాదించిన తర్వాత గుండె చెమ్మగిల్లకుండా, కళ్ళు చెమర్చకుండా ఎలా వుంటుంది? మీరూ చదవండి..

అనుభవం లోకి వస్తుంది.

సునందామృతం

తప్త భ్రాష్ట తిల న్యాయము

తప్త అంటే కాలిన లేదా వేడి చేయబడిన అని అర్థం. భ్రాష్టము అంటే వేపుడు చట్టి లేదా మంగలము లేదా మూకుడు.తిలలు అంటే నువ్వులు.

కాలిన మూకుడులో నువ్వులు వేస్తే పేలుతూ ఎలా పైకి ఎగురు తాయో కొందరు దుఃఖం,బాధ వచ్చినప్పుడు అణుచుకోలేక ఓ అని బిగ్గరగా ఏడుస్తూనో, సంతోషం,సంపద వచ్చినప్పుడు తామంత ఘనులం లేమని ఎగిరెగిరి పడుతూ వుంటారు.

అలాంటి వారిని ఉద్దేశించి చెప్పినదే ఈ తప్త భ్రాష్ట తిల న్యాయము.

మన చుట్టూ ఉన్న సమాజంలో ఇలాంటి వ్యక్తులు కొందరు తారసపడుతుంటారు. వారు ఏ చిన్న సంతోషం,సంపద వచ్చినా బాధ వచ్చినా ఈ ప్రపంచంలో తనకు వచ్చినట్లు మరెవరికీ రాలేదనే భావనలో ఉంటారు. అలాంటి వారి అతి ప్రవర్తనను గుర్తించి సుమతీ శతక కర్త ఏమన్నాడో చూద్దాం.

తన కలిమి ఇంద్రభోగము/ తన లేమియె సర్వలోక దారిద్ర్యంబున్/దన చావు జగత్ప్రళయము/ తను వలచినదియె రంభ తథ్యము సుమతీ!'×

అంటే... ' తనకున్న సంపద, అనుభవించే భోగాలలో ఇతరుల అందరి కన్నా తానే గొప్ప వాడననీ, ఒకవేళ పేదరికం దారిద్ర్యం వస్తే లోకంలో తనకంటే దరిద్రుడు ఇంకెవరూ లేరనీ, తనకు మరణమే సంభవిస్తే అది లోకమే మునిగి పోయేంత ప్రమాదకరమైనదనీ అంటే తాను చనిపోతే లోకమే లేదనే పరమ మూర్ఖత్వం కొందరిలో ఉంటుంది.అలాంటి వారి మాటలెంత విచిత్రంగా ఉంటాయంటే తాను ప్రేమించిన అమ్మాయి రంభంత అందమైనదని ఒప్పించేంత విధంగా ఉంటాయి.అది తెలివి, విజ్ఞత అనిపించుకోదు.వారి తెలివి తక్కువ తనం, మూర్ఖత్వం, అజ్ఞానం, దేనికైనా అతిగా స్పందించే స్వభావం అని అర్థం అవుతుంది. అలా వారి భావనలు, అభిప్రాయాలు వారి వరకే ఉంటే గొడవే లేదు కానీ అది అందరికీ తెలిసేలా, అందరూ గుర్తించేలా , ఎలాగైనా అంగీకరింప చేసేలా ఉంటాయి.ఇలాంటి వ్యక్తిని మన ఇళ్ళల్లో 'ఏదొచ్చినా పట్టలేదనీ' ,'వీడికి ఆన్నీ ఎక్కువే ' నని 'అతి

మినీ కవితకు ఆదికావ్యం శేషేంద్ర 'మండే సూర్యుడు'

తెలుగు సాహిత్యంలో సంప్రదాయ కవిత్వానికి వ్యతిరేకంగా వచనకవిత నేటికి వర్ధిల్లుతూనే ఉంది. వచన కవిత్వంలో ఎన్నో కావ్యాలు వెలువరించినవారు శేషేంద్రశర్మగారు. వీరి మండేసూర్యుడు 1974లో వెలువడింది. ఇది అభ్యుదయ దృక్పథం కల్గిన వచన కవితా కావ్యం. నాకున్న పరిజ్ఞానాన్ని బట్టి మండేసూర్యుడు లోని చిన్నకవితలే తెలుగు సాహిత్యంలోని మినీ కవితలకు ఆద్యం పోసాయనే భావనను కలిగింది.

సంప్రదాయ కవిత్వానికి ప్రత్యామ్నయం వెదికే క్రమంలో వచనకవిత ఉద్భవించింది. రచయితలు తమ రచనలోని స్వేచ్ఛకై కొత్త దారులు వెదికారు. దానికి దువ్వూరి, కవికొండల రచనలనే నిదర్శనం. 1930లోనే 'విష్ణుధనువు' 1938 లో 'నవమి చిలుక' అనే రెండు వచన గీతాలను వెలువరించిన వారు శ్రీశిష్టా ఉమామహేశ్వర రావు గారు. వీరు ఈ కవితలని వెలువరించిన నాటికి వచన కవిత్వం అనే ప్రక్రియకు ఆరంభమే లేకపోవడం చేత తను రాసిన కవితలకు ప్రాహ్లాద కవిత్వం అనే పేరుతో పిలుచుకున్నారు. ''ప్రాహ్లాద కవిత్వం అంటే ఆరిపోయే దీపాన్ని రగుల్చుతుంది. పరుగెత్తే పామును నిలేస్తుంది''అంటూ తన కవితా లక్షణాలు కూడా తెలిపినాడు. వచన కవిత్వానికి శిష్టా ఆద్యుడైనాడు. ఆనాడు ఇదొక విప్లవాత్మక మైన మార్పుగా సమకాలీన కవులు అభిప్రాయ పడ్డారు. అయితే వచన కవిత్వానికి నియమాలను లక్షణాలను నిర్ధారించే ప్రయత్నంలో ఆచార్య కోవెల సంపత్కుమార గారు, శ్రీ అరిపిరాల విశ్వంగారు, కొన్ని లక్షణాలు చెప్పిన, దానిని చేకూరి రామారావు గారు వచన కవిత్వానికి నిర్దిష్టమైన లక్షణాలు లేవని తేల్చేసారు. అయితే వచన కవులకు కూడా పద్యం మృతి చెందడం ఇష్టం లేదని వచనంలో వీలైనపుడు విరుపు, తూగు, లయలతో నొక్కి చదవడం చేస్తున్నారన్నారు ఆచార్య కేతవరపు రామకోటి శాస్త్రిగారు చెప్పడం ద్వారా ఈ చర్చ వచన కవిత లక్షణాలు ప్రత్యేకంగా ఏమిలేవనేది అర్థమవుతుంది.

పద్యం గద్యం కానిదిగా మిగిలింది. 60వ దశకంలో వచనకవిత్వం చారిత్రక అవసరంగా ముందుకువచ్చింది. ఈ వచన కవితకు 1960లో స్థిరత్వం వచ్చింది. ఇలా వచనకవిత ఉద్యమంగా మారింది. ఆ వచన కవిత్వ ఉద్యమానికి సారథ్యం వహించిన కుందుర్తి వచన కవితా పితామహులయినారు. ముద్దు కృష్ణ, శ్రీరంగం నారాయణబాబు, శ్రీశ్రీ, పురిపుండా, పఠాభి, జరుక్‌శాస్త్రి, తిలక్, వచన కవిత్వాన్ని బలపరుచగా దిగంబర, అభ్యుదయ, విప్లవ కవులు వచనకవిత్వానికి పరిపుష్టత చేకూర్చారు.

ఇలాంటి కాలమాన పరిస్థితులే మినీ కవిత్వానికి కూడా పురుడు పోసాయి. మనం మినీ కవిత్వం గురించి విచారించినట్లైతే మనకు శ్రీశ్రీ గారి మహాప్రస్థానంలో కొన్ని చిన్న పరిమాణం గల్గిన కవితలున్నా అవి గీతాలు గాను గేయాలగాను పాడడానికి వీలుగా లయ కల్గియుంటాయి. 1941లో రావు వేంకట మహీపతి గంగాధర రామారావు రాసిన "నామ రహితం"లో

"పొంగిపోయే శక్తి
మండిపోయే అశక్తి
ఈ రెంటికీ ప్రశక్తి
నాలోని వ్యక్తి" అన్న కవితా సూక్తులు కూడా వచన కవితలలాగే భావించారు. కాని మినీ కవితలని అనలేకపోయారు. ఆ సమకాలీన కవులు ఎక్కువగా చిన్నకవితలకు కాక దీర్ఘకావ్యాలకే ప్రాధాన్యతను ఇచ్చారు.

ఈ క్రమంలో శేషేంద్ర రచనలు చూస్తే 1951లో 'సోహ్రాబ్'తో మొదలయి 1961లో చంపూవినోదిని లాంటి సంప్రదాయ కవిత్వంతో మొదలయిన రచన క్రమక్రమంగా ఋతుఘోష, పక్షులు పద్యగేయ కావ్యాలుగా సాగి, 1974లో మండేసూర్యుడు 1975లో నాదేశం నాప్రజలు తర్వాత నీరై పారిపోయింది, గొరిల్లా సముద్రం నాపేరు, లేఖలు, ఆధునిక మహాభారతం జనవంశం ఇంకా కథలు విమర్శ శేషేంద్ర గారి కలం నుండి జాలువారినవి. కవిసేన మానిఫేస్టో వారి వారి రచనకు పరాకాష్ఠ.

శేషేంద్ర శర్మ పద్యగేయ కవిత్వం నుండి 1974 "మండేసూర్యుడు"వచన కవిత్వంలోకి ప్రవేశించారు. ఇది అభ్యుదయ కావ్యం. ఇందులో 36 కవితలున్నాయి. ఇందులో సగాని ఇరువైకి పైగా మిని కవితలే. అయితే వాటిని మిని కవితలుగా శేషేంద్రగారు 'మండేసూర్యుడు' కావ్య ఉపోద్ఘాతంలో ఎక్కడ ప్రస్తావించలేదు. అప్పటికి దీర్ఘ కవితలు వచనకవితలు విరివిరిగా వెలువడ్డాయి.

కాని చిన్న కవితల ప్రస్తావనే లేదు. శ్రీశ్రీగారి మహా ప్రస్థానంలో కూడా మూడు నాలుగు చిన్న కవితలున్నా, అవి పాడడానికి వీలుగా ఉన్న గేయాలేనని కొందరి విమర్శకుల అభిప్రాయం. అయితే శేషేంద్ర రాసిన "మండేసూర్యుడు" కావ్యంలోని వచన కవితలను మిని కవితలుగా పాఠకులు స్పృశించినా, దాన్ని చదివి అనుభూతి పొందారు. గాని వీటికి వేరే పేరును పెట్టాలని గుర్తించలేదు. విమర్శకులు వచన కవిత్వంలో పెద్దవాటిని దీర్ఘకవిత్వం అయినపుడు చిన్నదాన్ని ప్రత్యేకించి చెప్పనవసరం లేదనుకున్నారేమో. ఈ ఆలోచన దృష్ట్యా మిని కవితల ఆవిర్భావాన్ని నిర్దిష్టంగా చెప్పే పని లేకుండా పోయింది. అయితే 1975 నాటికే సాహిత్య పరిస్థితులు వచనకవిత్వానికి కూడ ప్రత్యామ్నయాన్ని వెదికింది. వచన కవిత్వానికి ప్రత్యామ్నయంగా చిన్నకవితలను మిని కవితలుగా గుర్తించారు. కాని వచన కవిత్వం లాగా మిని కవిత్వానికి కూడా స్థిరమైన లక్షణాల ఎవరు చెప్పలేదు. చిన్నవైనా పరిపూర్ణమైన భావాన్ని వ్యక్తపరిచేవిగానే కనిపిస్తాయి. వీటిని గుర్తించే క్రమంలో సాహితీ వేత్తలు విమర్శకులు వారి వారి నిర్వచనాలున్నాయి. అవి దేనికి అదే ప్రత్యేకం. శేషేంద్ర శర్మ 1974 లో రాసిన "మండే సూర్యుడు" కావ్యంలోని చిన్న కవితలే 1975 మిని కవితలకు జీవం పోసాయనే ఆలోచన రాక తప్పదు. ఎందుకంటే ఇందులో ఇరువైకి పైగా చిన్నకవితలే ఉన్నాయి. కాని వీటికి కూడా మిని కవితలని శేషేంద్ర ఎక్కడ పేర్కొనలేదు. యాభై యేండ్ల ముందు వెలువడ్డ స్వర్ణోత్సవ కావ్యం"మండే సూర్యుడు". ఇందులోని మిని కవితలను గుర్తించినపుడు శేషేంద్ర"మండే సూర్యుడు"మిని కవితలకు ఆది కావ్యంగా చెప్పవచ్చు. ఈ కావ్యం తర్వాతనే అంటే 1975లోనే మిని కవిత కూడా ఒక్క ఉద్యమ స్థాయిలో ముందుకు సాగింది. 'ఒక్కతార' కవితలో

"పైన చంద్రుడు మబ్బుతునక వేలుపట్టుకుని
నడిపించుకుని పోతున్నాడు
కింద నా జీవిక నిశ్శబ్దంగా కురిసే వెన్నెట్లో
నిశ్చలంగా తడిసే అడవిలా నుల్చోఉంది
ఒక్క కలని నా ప్రపంచంగా
మలుచుకుందామని కూచుంటే సముద్రం
సహస్ర బాహువులెత్తి బెదిరిస్తుంది
నీలి ఆకాశపు లోతుల్లో ఎక్కడో ఒక్కతార"

మబ్బు తునక వేలు పట్టుకొని నడవడం, వెన్నెట్లో నిశ్చలంగా తడుస్తూ నిల్చోవడం, కలని సముద్రం బెదిరించడం ఆకాశంలో తార కనబడడం. ఆకాశం సముద్రంలో ఆనంద భయాలతో కూడిన ఆకాశతారను తాను తన తలకింది దిండు కలగంటాడు. "ఒక్కటే" కవితలో



"రాళ్లెన్ని ఉన్నా దూరాన్ని కొలిచేరాయి ఒక్కటే
పక్షులెన్ని ఉన్నా ఒంటరి తనాన్ని తనమీద వేసుకుని
దిక్కులతో చూపులు కలిపే పక్షి ఒక్కటే
దిక్కులెన్ని ఉన్నా చూపులతో మాట్లిడే దిక్కు ఒక్కటే
మాటలెన్ని ఉన్నా పొందింది లేదు పోగొట్టుకున్నదీ లేదు
వెలుగు చీకట్ల సంగమంలో అని చెప్పేమాట ఒక్కటే
జీవితం అంతా అరిగిపోగా చివ్వరి రేణువులా మిగిలి ఉన్న
నా ఉనికి అంతా ఒక్క జ్ఞాపకం ఒక్కటే"

దూరాన్ని కొలిచే రాయి, చూపులతో మాట్లాడే దిక్కు ఒక్కటుంటుందని, సంగమంలో చెప్పేమాట, జీవితం అరిగి పోయినంక జ్ఞాపకం ఒక్కటే చివరి రేణువుగా గుర్తుండడం మొదలగు పదాలు ఎంతో తాత్విక దృక్పథాన్ని కల్గిన మినీ కవిత. "నేను"కవితలో

"నిద్రనించి బయటికి వస్తాను
స్వప్నంలోకి వెళ్ళిపోతాను
నేనులోకాన్ని చూడలేని బాధని
రాత్రి నేను కనే కలలు దినాల మీద కట్టే వంతెనలు
నేను పాట కాలేక పోయాన స్వరాన్ని
నాభాష తన నిండా బాధలు నింపుకుది
నేను అధరాల మీద మౌనం విధించుకున్న పర్వత శ్రేణిని
చీకట్ల దాస్యం ఛేదించుకుని చుక్కలు నా వాక్యాలై
సూర్యుడిలో కలిసిపోతున్న చిట్టచివరి రాత్రిని
రోజూ ఉదయాద్రి శిఖరం మీద
రక్తకాంతులు చిందే గుండ్రని పాటని"

నిద్రలో స్వప్నాలు కాదు. నిజ జీవితంలో కలలు బాధలు. అందరి బతుకులు పాటలా సాగవు. నేను మాట్లాడే భాషా బాధపడుతుంది. చివరి రాత్రి చుక్కలు సూర్యునిలో కలిసిపోవడం. ఒక రోజు గడిచిపోవడం.

మళ్ళీ ఉదయం ఇదంతా ఒకగుండ్రని పాటగా చెప్పినారు శేషేంద్ర శర్మగారు. ఇలా సాగిన మినీ కవితలు ప్రత్యేకమైన విశిష్టతను సంతరించుకున్నాయి. 1975లో మినీ కవిత్వ ప్రారంభానికి బాటను వేసాయి.

కనకనే 1980నాటికి ఒక గొప్ప ఉద్యమంగా సాగింది. మినీ కవితను ఎక్కువగా ప్రచారం చేసి మినీ కవితకు పితామహులైనవారు డా॥ రావి రంగారావుగారు. వచన కవిత్వం వచ్చిన ఐదు దశాబ్దాలకు మినికవిత వెలుగులోకి వచ్చింది. కాని అంతకంటే ఐదు సంవత్సరాల ముందే 1974 లోనే శేషేంద్ర మినీ కవితలు 'మండే సూర్యుడు' కావ్యంలో వెలువరించి మినీ కవితకు ఆద్యుడైనాడు.

-డా॥ మంథని శంకర్
సెల్: 8374354873

"అమరావతి సాహితీమిత్రులు" సంస్థ అధ్యక్షులు డా॥ రావి రంగారావు ఫేస్‌బుక్ గ్రూప్ లో నిర్వహిస్తున్న "వారం వారం మినీ కవితల పోటీ"లలో ఎంపికైన 'డబ్బు' పై మినీ కవితలు...
-డా. రావి రంగారావు 9247581825

చమురులా ఖర్చు పెడితే
దీపంలా వెలుగుతుంది!
నీళ్లలా ఖర్చు పెడితే
నిలువునా ముంచుతుంది!
వెలుగుతావో, మునుగుతావో
అంతా నీ చేతిలోనే వుంది...
-చిత్తలూరి

ఒక ఆశ

తల్లి ప్రేమలా
ప్రాణవాయువులా
డబ్బూ....
అందరికీ అందితే
ఎంత బావుణ్ణు.
-పాణిరావు యర్రగుంట్ల

డబ్బు
ప్రపంచాన్ని
శాసించగలిగే
శక్తిమంతురాలు!
ప్రాణాన్నికొనలేని
పేదరాలు!
-శింగరాజు శ్రీనివాసరావు

డ్యూటీ అవసరం లేదు,
కుర్చీ అవసరం లేదు,
ఒక బల్ల ఉంటే చాలు,
ఉద్యోగం చేస్తాడు...
బల్ల కింద చేయి చాచటానికి!
-సంద్యాల లక్ష్మారెడ్డి

అదుపు తప్పిన
ఖర్చు గుర్రా నికి
మదుపు పొదుపు
కళ్లెం వేయాలి
ఐశ్వర్యం నిలబడా లంటే!
-పి. రామకృష్ణ

నలిగినా
మురికి పట్టినా
విలువ మారకుండా
తన స్థానం మారి
మనిషికి
విలువ కట్టేదే డబ్బు.
-చింతా రాంబాబు

గుణాలు
గణాలు
గ్రహాలు
పచ్చనోటు చుట్టే
పరిభ్రమణాలు!
-మల్లాడి శ్రీనివాస

శతకోటి
దండాలు పెట్టించేది
మనల్ని
తన చుట్టు తిప్పుకునేది...
కళ్ళు కాళ్ళు లేకపోయినా
మనకు బుర్ర లేనంత కాలం!
-పార్థశ్రీ తాళ్లూరి

పరిమితి

అవసరానికి చాలకుంటే
అమ్మలా
జాగ్రత్త నేర్పుతుంది !
అవసరానికి సరిపడా ఉంటే
భార్యలా
కుదురుగా ఉంచుతుంది !
మించి ఉంటే
ప్రియురాలిలా
దుబారా చేయిస్తుంది !
-వసుధ

చుట్టూ వసంతమే
జేబు
నిండుగా వుంటే...
ఎటు చూసినా
ఎడారే..
జేబు నిండుకుంటే...
-జాగరాపు శంకరరావు

మొన్న అవసరం!
నిన్న ఇష్టం!
నేడు వ్యసనం!
మనిషి మస్తిష్కానికి
పట్టిన గ్రహణమే
మనీ!!
-ధనుంజయ రెడ్డి

రూపాయి విలువ
దిగజారినందుకేమో
కాగితపు కరెన్సీ చిన్నదై
చిరిగిపోతుంది!
-గోలి మధు

విలువైందనుకుంటే
విలువ ఇస్తుంది.
అశ్రద్ధ చేస్తే
మెతుకూను దూరం చేస్తుంది
మనం మలుచుకునే తీరు
డబ్బు తీరం.
-కొతపల్లి త్రినాథరాజు

నీతి

డబ్బుని
మనం శాసిస్తే
జీవితం!
డబ్బు మనల్ని
శాసిస్తే
మరణం!
-మల్లారెడ్డి రామకృష్ణ

ఆడతనం గడప దాటడం,
గిట్టని మగ మహారాజు. కూడా
ఆఫీసులో దిగబెట్టి,
తీసుకొస్తా డింటికి ప్రతిరోజు.
గిరిగీసే మగతనాన్ని
గిరవాటేసిందీ "జీతం"
-కొండ్రెడ్డి నాగిరెడ్డి

వరద

డబ్బూ
స్మార్టు ఫోన్...
రెండూ అవసరమే కానీ
ఎప్పుడు ముంచుతాయో
ఎప్పుడు తేల్చుతాయో
జాగ్రత్త పడేవారే
మనుషులు!
-డా. రావి రంగారావు, గుంటూరు.

పుస్తక సమీక్ష

వినోదము విజ్ఞానము పెంపొందించే బాల సాహిత్యం

ప్రతులకు:
సుతారపు వెంకటనారాయణ
ఇ.నెం. 12-11-367/6
మారుతీ వీధి, వారాసిగూడ
సికింద్రాబాద్, హైదరాబాద్-061.
సెల్: 9848958690

నేటి బాలలే రేపటి పౌరులు. అపటి పౌరులను, నేటి నుండే సక్రమమైన మార్గంలో తీర్చిదిద్దాలి. ఎందుకంటే- మొక్కయి వంగనిది మానై వంగదు. తెలుగులో వస్తున్న బాల సాహిత్యం చాలా తక్కువ. కారణం- తలిదండ్రులు ఈ అవసరాన్ని గుర్తించటం లేదు. అథవా గుర్తించినా, ఆర్థికంగా అనుకూలమైన పరిస్థితి వారికి ఉండటం లేదు. గ్రంథాలయాలకు ప్రోత్సాహం కరువు అవుతున్నది. ఈ లోటును పూరించాలనికా అన్నట్లు కొందరు కొన్ని సంస్థల స్థాపన ద్వారా తమ వంతు కృషి చేస్తున్నారు. బాల చెలిమి, తెలంగాణ సారస్వత పరిషత్‌లాంటి సంస్థలు తమ ప్రచురణలు, సమావేశాల ద్వారా రచయితలను ప్రోత్సాహపరుస్తున్నవి. అయితే, చేయాల్సింది కొండంత. చేయగలుగుతున్నది పిసరంత.

'ఆనంద లహరి' గేయాలు పాటలు కవితల రచయిత సుతారపు వెంకట నారాయణ ఒక వ్యక్తిగా, సమాజాన్ని తీర్చిదిద్దగలిగిన ఒక ఉపాధ్యాయుడిగా, బాధ్యతాయుత పౌరుడిగా మంచి, మార్గదర్శనం చేయగలిగే సాహిత్యాన్ని సృష్టిస్తున్నారు. ఈ అంకిత భావమే వీరికి 'జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు' పురస్కారాన్ని తెచ్చిపెట్టింది.

లోగడ నారాయణగారు మనసు లిపి, కరోనా కదలికలు అక్షర లహరి అనే కవితా సంపుటులు ప్రచురించి పలువురి ప్రశంసలు అందుకున్నారు. ఆ వరుసలో ఇప్పుడు ఈ గేయ సంపుటితో బాలురకు అలరించుటకై మన ముందుకు వచ్చారు.

బాలలను ఉద్దేశించి వ్రాసిన ఈ సంపుటిలో 67 గేయాలు పాటలు కవితలు అనబడే రచనలు ఉన్నాయి. 'అమ్మా నను రక్షించు' బాల కార్మికుల లాంటి కవితలు సమాజపు పోకడలను బాలలకు తెలియ చెప్పే విధంగా ఉన్నాయి. త్రిభాషా ప్రవీణుడైన వీరు కొన్ని హిందీ మరికొన్ని ఇంగ్లీషు కవితలను కూడా ఇచ్చారు. సులభగ్రాహ్యత కొరకు వీటిని తెలుగు లిపిలో ఇవ్వటం విశేషం. సలుగురు కలిసి పాడుకునేలా, లేదా క్లాసులో టీచర్ దర్శకత్వంలో పాడుకోటానికి అనువుగా ఉన్నాయి. చిలుకలు, ఏనుగు చందమామ, నక్షత్రాలు వాన, పువ్వులు లాంటి విషయాలే కాకుండా, పిల్లలలో ఆసక్తి రేకెత్తించే భువనగిరి, భూదాన్ పోచంపల్లి అంబే ద్కర్. సినారె వట్టికోట ఆళ్వార్‌స్వామి, జయశంకర్ లాంటి వారల గురించి పాటలు కట్టి అందిస్తున్నారు. కొన్ని ఉయ్యాల పాటలు ఆడపిల్లలు ఆడుతూ పాడుతూ జ్ఞాన సముపార్జన చేసికునుటకు వీలవునట్లు గా ఇవ్వబడ్డాయి. సుతారపు వెంకట నారాయ ణగారి ఈ సంపుటి బాలలకు ఆనందంతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించు తుంది.

- కూర చిదంబరం
సెల్: 8639338675

గద్ద సాయం

కథ

ఆకాశంలో ఒక డేగ ఎగురుతోంది. దానికి చాలా ఆకలిగా ఉంది. ఇంతలో దానికి క్రింద నేలపైన ఒక ఉడుత పిల్ల కనిపించింది. అది క్రిందకు దిగి ఆ ఉడుత పిల్లను పట్టుకొని పైకి ఎగిరింది. అది కొంచెం దూరం పోగానే దానికి ఒక గద్ద ఎదురైంది. అది డేగతో " మిత్రమా! నాకు మూడు రోజుల నుండి ఆహారం లేదు. నీకు దొరికిన ఆహారాన్ని నాకు ఇవ్వు. నేను నా ప్రాణాలను నిలుపుకుంటాను. నాకు ఎగిరే శక్తి కూడా లేదు . నా ప్రాణం కాపాడు" అని అంది. కానీ ఆ డేగ దానికి జవాబు ఇవ్వకుండానే వెళ్ళిపోయింది .

ఆ తర్వాత ఆ గద్ద ఎగిరే శక్తి లేక కిందకు దిగింది. అక్కడ అదృష్టవశాత్తు దానికి ఆహారం దొరికింది. అది ఆ ఆహారంతో కడుపు నింపుకుంది. అది తన నివాసానికి తిరిగి ఎగిరి వెళ్లిపోయింది.

ఇలా కొన్నాళ్లు గడిచాయి. ఒకరోజు ఆ గద్ద తన ఆహారాన్ని సంపాదించుకొని తిరిగి వస్తున్న సమయంలో దానికి మునుపటి డేగ కనబడింది . అది గద్దతో "మిత్రమా! నిన్ను ఆహారం అడిగే అర్హత కూడా నాకు లేదు . ఎందుకంటే గతంలో నేను నీకు అస్వస్థతగా ఉన్నా ఆహారం ఇవ్వలేదు. నీవు ఇప్పుడు ఇవ్వవని నాకు తెలుసు. అయినా ఒంట్లో ఓపిక లేక నేను అడుగుతున్నాను. ఈ ఆకలికి నేను తట్టుకోలేకపోతున్నాను. నాకు ఆహారం కావాలి" అని అంది. అప్పుడు గద్ద " అయ్యో మిత్రమా ! కిందకు దిగుదాం పద. నీకు నేను సంపాదించిన ఆహారాన్ని ఇస్తాను "అని అంది . అవి రెండు కిందికి దిగాయి . గద్ద తాను తెచ్చుకున్న మొత్తం ఆహారాన్ని డేగకు ఇచ్చింది. అది తిన్న డేగ ప్రాణాలు నిలిచాయి.

ఆది గద్దతో "మిత్రమా! నీవు ఆహారం ఇవ్వవని నాకు మరణం ఖాయమని నేను అనుకున్నాను . కానీ నీవు నీ ఆహారాన్ని ఇచ్చి నా ప్రాణాలను కాపాడావు . నేను నీకు ఆహారం ఇవ్వనప్పటికీ నీవు నాకు ఆహారం ఇచ్చావు. నీ మేలు మరువలేను . నీ నుండి నేను చాలా నేర్చుకున్నాను" అని అంది . అప్పుడు గద్ద "అయ్యో మిత్రమా! ఇతరుల ప్రాణాలు కాపాడటం మన విధి . నాకు ఆకలిని తట్టుకునే శక్తి ఉంది . అయినా నీ గుణం నీది . నా గుణం నాది . నాకు ఎప్పుడు ఇతరులకు సాయ పడాలనే ఉంటుంది . అందుకే నీకు ఆహారాన్ని ఇచ్చాను. ఇందులో నా గొప్పతనం అంటూ ఏమీ లేదు . నేను చేసినది అతి స్వల్పం "అని అంది. దాని మాటలకు ఆ డేగ ఎంతో సంతోషించి "నీలాంటి వారి స్నేహం కోరే అర్హత కూడా నాకు లేదు. నీవు నన్ను మన్నించు. నీవు ఒప్పుకుంటే నాకు నీతో స్నేహం చేయాలని ఉంది "అని అంది. అందుకు గద్ద అంగీకరించింది. అవి రెండు ఇతరులకు సాయపడుతూ తమ స్నేహాన్ని కొనసాగించాయి. అందుకే పిల్లలూ! మనకు ఇతరులు సాయపడకున్నా మనం ఇతరులకు సాయం చెయ్యాలి. మన మంచిగుణం వీడకూడదు.



-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
9908554535

నాయిన

నాన్నంటే ఎవరో తెలుసునా, అమ్మ నుదుట మెరిసే బొట్టురా
కష్టాలను భరించి, సుఖమ్ముల తీపి పండ్ల నిచ్చెడి చెట్టురా.
భవితాకాశాన బిడ్డలను నిలబెట్టాలని
నిరంతరం శ్రమలో కరిగే తేనెపట్టురా.
చదువుల జాతరలోన విహరించినాక విజయ తిలకం దిద్దుకొని
ఇంటికి వస్తే కొడుకు స్వాగతం పలికెడి యింటి ముందర మెట్టురా
జీవితమన్నదీ యిలలో సుఖ దుఃఖమ్ముల పెనుగులాటే గదరా ఎవరికైనా
బాదరబందీలు కలవరపెట్టకుండా యింటి చుట్టూ నిలిచిన గట్టురా
పండుగలన్నీ సంబరాల జాతరలో కొలువైనప్పుడు
పిల్లల మదిలో పొంగినట్టి ఆనందపు హేలకి జట్టురా
జీవితమంటే యిపుడు ఆర్థిక లావాదేవీలే ఓ పృథ్వీ!
ఎనెని తరుముకొచ్చిన
తనలోనె దాచుకొనెడి యింటి గుట్టురా!

-ఎస్.ఆర్. పృథ్వీ,
సెల్: 9989223245

తొలిపాఠం



కాలంపై
కాలు దువ్వకు- సవాల్ విసరకు
కాలానికి పనికి రాకుండా పోతావు!
కాలక్షేపం అంటూ
చెడుకు బానిసవి కాకు-
సర్పమై కాటేస్తుంది నిన్ను!
లేదని..
కాదని తప్పించుకోకు-
ఏదీ నీకై ఎక్కడా నిరీక్షించదు!
ఆడంబరానికై
ఆరాటపడకు, అలమటించకు-
అది నిన్ను నిర్జీవుడ్ని చేసేస్తుంది!
ఆసరా కోసం దిక్కులు చూడకు
అవకాశాన్ని అంది పుచ్చుకో-
అదే నిన్ను గెలిపిస్తుంది!
ఏమీ చేయలేనని చేతులు ముడుచుకోకు-
పరిసరాలను గమనించు-
అందులోనే పరిశ్రమ దొరుకుతుంది!
నీరసమంటూ నిస్సత్తువగా వుండకు-
అరవైలోనూ ఇరవై అనుకో-
ఆవగింజంత అలసట నీదరి రాదు!
మోసపోయానని
మరొకర్ని మోసగించకు-
అది తొలి పాఠమని అర్థం చేసుకో!

-ఎన్.విజయా కిషన్ రెడ్డి
98488 68085

జీవిత సత్యాల ఆవిష్కరణం
సామాజిక బ్రతుకు ఘటనల వ్యాఖ్యానం

సప్తపది

లఘు కవితా ప్రక్రియ
సృజనకర్త : సుధామ
నిర్వహణ: విహారి (హితవరి), శాంతిమూర్తి

గెలుపు
తెలుపు
దేశంలో ప్రజాస్వామ్య పురోగతికి
ఫలితాలే మలుపు
-టేకుమళ్ళ ఆనందరావు, సింగపూర్

మార్చుకో
ఓర్చుకో
ప్రశాంతత కావాలంటే సంతోషంగా ఉండటం
నేర్చుకో
-సింగీతం విజయలక్ష్మి, చెన్నై

క్షరం
నిరక్షరం
అజ్ఞానమనే అంధకారాన్ని అంతమొందించే
అస్త్రం అక్షరం
-కోటమహంతి వెంకటరావు(కోవెరా), విశాఖపట్నం

కలిసిపోవాలి
మెలసిపోవాలి
విభజన అనివార్యం అయినపుడు చిరునవ్వుతో
విడిపోవాలి
-గండె శోభారాణి చందానగర్, హైదరాబాదు

ధర్మం
కర్మం
ప్రతి జీవి తెలిసి మెలగాలి మర్మం!
-మొర్రి గోపి, కవిత

విధానం
వ్యవధానం
తలపెట్టిన కార్యం సాఫల్యానికి అనుసరించాలి
సంవిధానం!
-గోపరాజు వెంకట సూర్యనారాయణ హైదరాబాద్.

కాలం
కరవాలం
సరిగా వాడితే జీవితాలు అవుతాయి
సుఖాలవాలం
-పున్నయ్య పాతకోటి, ఖమ్మం.

భక్తియోగం
జ్ఞానయోగం
కర్తవ్యాలు బాధ్యతలు చక్కగా నెరవేర్చడమే
జీవనయోగం
-గడ్డం దేవీప్రసాద్, బెంగళూరు.

నిలుపుతుంది
కలుపుతుంది
భాష చెప్పలేని భావం స్పర్శ తెలుపుతుంది
-జూపూడి హనుమంతరావు హైదరాబాద్

ఆధిపత్యం
ఆభిజాత్యం
ఉంటుంది కొందరికి పదవుల కోసం
అనునిత్యం
-షామీర్ జానకీదేవి, హైదరాబాద్

యోజనం!
ప్రయోజనం!!
మనసు గెలిచిన నాయకుడికి
ప్రజలు నీరాజనం !!!
-మన్నవ నాగ లలిత శ్రీదేవి విజయవాడ.

నిద్ర
భద్ర
విశ్రాంతి తీసుకుని లేచిన ఒళ్లు శక్తిముద్ర
-కోపల్లె మురళి, సికింద్రాబాద్

మోసపోకు!
మరచిపోకు!
లొంగిపోయి అన్యుల ప్రచారాలకు,
హిందూధర్మాన్ని వదలిపోకు
-భువనేశ్వరి మారేపల్లి హైదరాబాద్

ప్రాసం
గ్రాసం
ఏది లేక పోయినా నడవదు బ్రతుకు విన్యాసం
-ద్విభాష్యం నాగలక్ష్మి, అనకాపల్లి

గెలుపు
మలుపు
గమ్యానికి పురోగమించే మార్గాలను ప్రస్ఫుటంగా
తెలుపు
-కాదంబరి శ్రీనివాసరావు, తిమ్మాపురం

తెలిపేదెలా
చూసేదెలా
ఉల్లాసంగా కనపడినా లోలోపలి
నైరాశ్యం ఎరుకపరిచేదెలా
-సాధన. తేరాల, ఖమ్మం,

జనాలు
నీరాజనాలు
నాయకునికై కొందరు వీరంగాలు..సాధించుటకై
స్వార్థప్రయోజనాలు!!
-జీ యస్ వీ సత్యనారాయణ హైదరాబాద్

జరిగేది
మెరుగేది
ఎన్నికల ఫలితాలతో ఏముంది
జీవితాల్లో ఒరిగేది
-వి శ్రీనివాస మూర్తి , హైదరాబాదు

గోప్యం
జాప్యం
విచక్షణతో వ్యవహరించకపోతే అపజయాలను
మోస్తుంది వృద్ధాప్యం
-గోమతి (సుమచంద్ర), హైదరాబాద్

ఉషస్సు
యశస్సు
కలిగేను తొలగితే నీలోని అజ్ఞాన తమస్సు
-అమృతవల్లి అవధానం హైదరాబాద్

వైద్యం
సేద్యం
ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి చూడక చోద్యం
-డా॥ చిట్యాల రవీందర్ హైదరాబాద్

సూత్రాలు
స్తోత్రాలు
సంకల్పం నెరవేరాలంటే శ్రమించు ,తపించు
దివారాత్రాలు
-విన్నకోట ఫణీంద్ర, హైదరాబాదు

రాక
పోక
తెలుసుకోవడం కష్టమైనా అందరూ పెడతారు కేక.
**-ద

పొంతకుండ

కథ

-వంశీ కృష్ణ

1978లో వ్రాసిన కథ

ఇంటి ముందు లారీ ఆగి వుంది. ఆసరికే శ్యామల ఇద్దరు పిల్లలు లారీలో ఎక్కి కూర్చున్నారు. అన్ని సామాన్లు వచ్చినట్లేనా? లేక ఇంకా ఏమయినా మర్చిపోయామా? అని ఇల్లంత ఒకసారి కలియ చూడసాగేడు రఘురామ్. వంటింట్లో ఒక మూలగా వున్న 'పాతకుండ' వొకటి కన్పించింది రఘురామ్‌కి. దాన్ని తీసుకుని బయటకు వచ్చాడు. కుండ తీసుకుని బయటకు వస్తున్న రఘురామ్‌ని చూసి 'ఎందుకది' అన్నట్లుగా మొహం చిట్లించింది శ్యామల.

రఘురామ్ మాట్లాడకుండా దాన్ని లారీలో పెట్టాడు. దాదాపు ఏడేళ్ల పాటు అద్దెకున్న ఆ యింటి వంక మరొక్కసారి చూసి తనూ లారీ ఎక్కాడు రఘురామ్. లారీ బయలుదేరింది.

"సొంత యిల్లు" అన్న రఘురామ్ కోరిక ఇప్పటికి నెరవేరింది. ఎల్.ఐ.సి.లో లోను తీసుకుని, మెచ్యూర్ అయిన రెండు ఆర్.డి.లు కలుపుకుని సంగీతరావు దగ్గర ఓ పదివేలు అప్పుచేసి ఇల్లు కట్టాడు అతను.

దశమి, శుక్రవారం మంచిది అనడంతో నిన్న పాలు పొంగించి, ఇవాళ ఇంట్లోకి మొత్తం షిఫ్ట్ అవుతున్నారు. కొత్త యింట్లో కొత్త జీవితం గురించి శ్యామల, పిల్లల ఇద్దరూ ఉత్సాహంగా ఊహిస్తున్నారు. రఘురామ్ మాత్రం చాలా మామూలుగా వున్నాడు.

లారీ ఆగింది. వాడీ వాడని తోరణాలు, వనుపు వచ్చటి ద్వారబంధాలు స్వాగతమిచ్చాయి. సామానంతా ఇంట్లోకి చేరవేయసాగేరు. ఆ కొత్త యింట్లో అదీ, ఇదీ సర్దుతున్నపుడు మరీముఖ్యంగా వంటింట్లో గ్యాస్‌స్టౌవ్, సిలిండర్ అమరుస్తున్నపుడు అతనికి జానకమ్మ గుర్తుకొచ్చింది. రఘురామ్ హృదయం బాధగా మూలిగింది.

జానకమ్మ రఘురామ్ తల్లి. " ఈ క్షణంలో అమ్మ వుంటే ఎంత సంతోషించేదో" అనుకున్నాడు రఘురామ్ తల్లిని గుర్తుచేసుకుంటూ!

రఘురామ్ అంటే జానకమ్మకు బోలెడంత ప్రేమ. జానకమ్మ అన్నా రఘురామ్‌కీ అంతే. ఆమెను విడిచి ఒక్కక్షణం వుండలేదు ఎప్పుడూ రఘురామ్. అలాంటిది.. ఇప్పుడు ఇది తప్పనిసరి దూరం.

అమ్మ జానకమ్మ జ్ఞాపకాలు రఘురామ్‌ని చుట్టుముట్టాయి. జానకమ్మ కలిగిన కుటుంబం లోంచి ఏం రాలేదు. ఆమె తరపువాళ్లు, భర్త తరపువాళ్లూ.. అంతా రెక్కాడితే కానీ.. డొక్కాడని వాళ్లే! ఏ రోజు కూలీ పనిలోకి వెళ్లపోతూ.. ఆ రోజు ఇంట్లో పస్తే. ఎన్నో కష్టాల, కడగండ్ల నడుమ జానకమ్మ జీవితం వెళ్లిపోయింది.

జానకమ్మ బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం అంతా పల్లెటూళ్లోనే గడిచిపోయింది.

పల్లెటూరు అంటే సిటీకి దగ్గరగా వున్న ఓ చిన్న సైజుబస్తీ లాంటి పల్లెటూరు కాదు. నాగరికత వాసనలు ఏవీ సోకని శుద్ధ పల్లెటూరు అది. ఎవరికైనా రోగమో రొష్టో వస్తే డాక్టరు దగ్గరికి వెళ్లాలి అంటే నలుగురు మనుషులు కలిసి ఒక మంచం సూరీ కట్టి ఇవరై మైళ్లు నడిస్తే కానీ రైలు దొరకదు. మళ్లీ రైల్లో గంట ప్రయాణం. అలాంటి ఊళ్లో తను జీవితం అంతా, తన వాళ్ల కోసం కొవ్వొత్తిలా కరిగించుకుంది జానకమ్మ.

ఇద్దరు పిల్లలు పోయిన తరువాత కలిగిన మగ నలుసు రఘురామ్. అందుకే అతనంటే

> **జానకమ్మ కలిగిన కుటుంబంలోంచి ఏం రాలేదు. ఆమె తరపువాళ్లూ, భర్త తరపువాళ్లూ.. అంతా రెక్కాడితే కానీ.. డొక్కాడని వాళ్లే!**

జానకమ్మకు చెప్పలేని ప్రేమ. అతను నడిస్తే పాదాలు కందిపోతాయని తన అర చేతులు పరిచేది జానకమ్మ, రఘురామ్ అంతే!

స్వామి రఘురామ్ తండ్రి. అతను ఏ పనీ చేసేవాడు కాదు. తనకు పని గండం వుందని చెప్పుకునేవాడు అతను పని చేస్తే తను చచ్చిపోతాననీ.. తను చచ్చిపోయి జానకమ్మను పసుపు, కుంకుమలకి దూరం చేయడం తనకు ఇష్టం లేదనీ.. అందుకే తను పని చెయ్యనని ఖండితంగా చెప్పవాడు. తను నేర్చుకున్న నాలుగు అక్షరం ముక్కలనయినా.. నలుగురు పిల్లలకి నేర్పమంటే అలాగే అని పిల్లలు నలుగుర్నీ కూర్చోపెట్టుకునేవాడు.

పాఠం చెప్పే క్రమంలో పిల్లల్ని చావబాదేవాడు. ఒక్కో పిల్లాడి ఒంటి మీద వాతలు తేలేవి. దాంతో ఇరుగు పొరుగు వాళ్లు పోట్లాటకి వచ్చేవారు.

"నేను చెప్పలా! నాకు పని గండం వుందని! నేను పని చెయ్యటం దేవుడికి కూడా ఇష్టం లేదు! లేకపోతే ఒక చిన్న దెబ్బకే వాడి వీపు మీద వాతలు తేలటం ఏంటి వాళ్లు ఇలా ఇంటి మీదకు తగవుకి రావడం ఏంటి?" అనేవాడు స్వామి.

స్వామిని ఏమీ అనలేకపోయేది జానకమ్మ.

స్వామినీ, రఘురామ్‌నీ సాకాల్సిన బాధ్యత జానకమ్మ మీద అనివార్యంగా పడింది.

సాయంత్రం అయితే, చాలు, అంతో ఇంతో మందు పడందే గొంతు లుంగ చుట్టుకు పోతుంది స్వామికి. మందు పడటం గంట, గంటన్నర ఆలస్యం అయితే చాలు, మూర్ఛలరోగిలా గిలగిలా కొట్టు కునేవాడు స్వామి. దాంతో జానకమ్మ సంపాదనలో సగం భాగం స్వామికీ, స్వామి తాగుడికీ సరి పోయేది. ఉదయం లేచిందగ్గర్నుంచీ, సాయంత్రం పడుకునే వరకూ, నడుం విరిగిపోయేలా ఆమె కష్టపడేది. అయినా ఐదు వేళ్లు నోట్లోకి పోవడం కష్టంగా వుండేది.

అన్ని కష్టాలలోనూ ఆమెకు ఒక్కటే ఆశ. రఘురామ్‌ని పెద్దగా చదివించాలి. వాడు ఏ గొప్ప ఉద్యోగస్తుడో అయితే చూసి ఆనందించాలి. ఆమె ఆశలకు అనుగుణంగానే రఘురామ్ చదువులో ఒక్కో మెట్టూ ఎక్కి రాసాగేడు.

చిమ్మ చీకటిలో బ్రతుకులో వాడు ఒక్కడే తనకు కాంతిరేఖ అనుకునేది జానకమ్మ. జానకమ్మ కష్టాలని స్వయంగా చూస్తున్నవాడు కనుక పెద్దయ్యాక ఒక మంచి ఇల్లు కట్టి, అందులో జనకమ్మని మహా రాణిలా చూసుకోవాలి అనుకునేవాడు రఘురామ్.

తను ఏం చేస్తే జానకమ్మ వేదన తీరుతుందా? అని అతను అనుక్షణం ఆలోచించేవాడు ఎలా నడుచుకుంటే జానకమ్మకు సంతోషం కలుగుతుందా? అని అతను ఆలోచించేవాడు.

రూపాయికాసంత తిలకం నుదుట జానకమ్మ,, ఏ భావాన్నీ బయటకు వెల్లడించేది కాదు. సముద్రంలాగా ఆమె గంభీరంగా ఉండేది. సముద్రంలాగే ఆటుపోట్లనీ తట్టుకునేది.

ఆమె తరచూ వెన్ను నొప్పితో బాధపడేది. అది ఎందుకు వస్తుందో కూడా ఆమెకు అర్థం అయ్యేది కాదు. అన్నం తింటున్నప్పుడో.. మునివేళ్ళ మీద ఆధారంగా, మోకాళ్ళపై వంగి పొయ్యి ఊది ఊది మండిస్తున్నపుడో వెన్నులో కలుక్కుమనేది. ఆ నొప్పి రోజల్లా ఆమెను అతలా కుతలం చేసేది.

జీవితంలో ఎన్నో కష్టనష్టాలను ఓర్చుకున్న జానకమ్మ.. ఈ వెన్ను నొప్పినిభరించలేకపోయేది. ఉపశమనం కోసం ఆచార్యుగారి దగ్గరకు వెళితే.. అతను ఏవో ఆయుర్వేద మందులిచ్చి తేనెలో రంగరించి తినమనేవాడు. అయినా వెన్నునొప్పి ఆగేది కాదు. వెన్నుకి ఎవరో ఇంజక్షను చేసి లోపల్నుండి నీరు లాగుతున్నంత బాధ.. ఆమెను హింసించేది.

''మా అమ్మ, అమ్మమ్మ కూడా ఈ వెన్నునొప్పితోనే మంచం ఎక్కారు. నేను కూడా ఈ నొప్పితోటే కడతేరుతానేమో!" అనుకునేది జానకమ్మ.

"కొన్ని కొన్ని వ్యాధులు వంశ పారంపర్యంగా వస్తాయట! ఇదికూడా అలాంటిదేనేమో'' అనుకునేది జానకమ్మ ఒక్కొక్కసారి. కానీ తన ప్రాంతంలో.. తనలాగే చాలామంది వెన్నునొప్పితో బాధపడటాన్ని ఆమె గమనించింది.

జానకమ్మ వెన్ను నొప్పితో గిలగిల లాడటాన్ని చూసి తట్టుకోలేకపోయేవాడు రఘురామ్. ఆ నొప్పి తనకొచ్చినా బాగుండును అనుకునేవాడు. కానీ తన తల్లిలాగే ఇద్దరు, ముగ్గురు అలాగే బాధపడటాన్ని చూశాక అతను ఆ వెన్నునొప్పికి ఏదో ప్రత్యేకమయిన కారణం ఉండి వుండాలనుకున్నాడు.

అదేంటో ఎంత ఆలోచించినా అతనికి అర్థం కాలేదు. దాని గురించి దాదాపు అతను నెలా.. నెల పదిహేను రోజులపాటు సుదీర్ఘంగా ఆలోచించాడు.

తన గురించి తన కొడుకు ఆలోచిస్తున్నాడు. అని తెలిసి జానకమ్మ సంతోషంతో పొంగి పోయింది..

"ఉదయం నుంచీ మౌనంగా.. ఆలోచన్లతో సత మతమవుతున్నారు? నాకు చెప్పకూడదా?" అంటూ శ్యామల ప్రశ్నించేసరికి ఆలోచనల్లోంచి బయటకు వచ్చాడు రఘురామ్.

'ఏమీ లేదు!" అన్నాడు రఘురామ్.

ఇల్లంతా సర్దటం పూర్తి అయినట్లుంది. పిల్లలు ఉత్సాహంగా డాబాపైకి కిందకీ తిరుగుతున్నారు.

ఇంట్లోంచి బయటకు వచ్చి ఒక్కసారి ఇంటి వంక చూశాడు రఘురామ్. లేత ఎండలో "జానకీ నిలయం" అన్న అక్షరాలు మిలమిల మెరుస్తూ కన్పించాయి. తన పేరు పెట్టకుండా, తల్లి పేరు పెట్టినందుకు శ్యామలకి చాలా కోపం వచ్చింది. అయినా

> **"కొన్ని కొన్ని వ్యాధులు వంశ పారంపర్యంగా వస్తాయట! ఇదికూడా అలాంటిదేనేమో" అనుకునేది జానకమ్మ ఒక్కొక్కసారి.**

అతడు పట్టించుకోలేదు.

తల్లిని ఏదో ఒకరకంగా గుర్తు చేసుకోవడం అతడికి ఇష్టం. అతడు ఏదో తరగతి పాసయ్యాక ఇంటర్ మీడియట్‌కి సిటీకి వెళ్ళాల్సి వచ్చింది. జానకమ్మ కుటుంబ పరిస్థితులకి రఘురామ్‌ని ఏదో తరగతి దాకా చదివించామే గొప్ప. అలాంటిది ఇంకా చదివిస్తాను అనేసరికి అందరూ ఆమెను వింతగా చూశారు.

"పది వరకంటే మన ఊళ్ళో ఉంది కాబట్టి ఏదో బండి లాగింది. ఇప్పుడు పట్నంలో ఉంచి చదివించటం అంటే మాటలా? వాడిని చూస్తే ఎందుకూ కొరగాని వాడు.

నువ్వు ఆడదానివి. ఇంత పెద్ద బాధ్యత ఎలా మోయగలుగుతావు. వద్దు! వాడు చదివినంత వరకూ చాలు కానీ.. పిచ్చి పిచ్చి ఆలోచన్లు చేయమాక'' అంటూ ఇరుగు పొరుగూ మందలించేరు. కానీ జానకమ్మ వినిపించుకోలేదు.

తనకు వున్న ఒక్కగానొక్క పుస్తెలతాడు అమ్మేసింది. "తల్లి మాంగల్యం తెగనమ్ముకుని తను చదువుకోకపోతే ఏం?" అని రఘురామ్‌కీ అన్పించింది. కానీ.. తల్లి మాటను కాదు అనలేకపోయాడు.

సాధ్యమయినంత వరకూ తల్లిని కష్టపెట్టకుండా ఉండాలని అతను ప్రయత్నం చేసేవాడు. ఇంటరు చదువుతూ అతను ట్యూషన్లు చెప్పేవాడు. అలా వచ్చిన వంద, రెండు వందల్లో.. వంద రూపాయలు జానకమ్మకి పంపిస్తే.. జానకమ్మ ఏం అన్నదో అతనికి బాగా గుర్తుంది.

''చిన్నా! నిన్ను బాగా చదువుకోమని పంపిస్తే.. ఇదా నువ్వు చేసే పని! పిల్లలకి పాఠాలు చెప్పటానికే నీ సమయం అంతా సరిపోతే.. ఇంక చదువుకునే దెప్పుడు? అందుకని ఇవన్నీ మానెయ్యి" అంది.

అయినా రఘురామ్ విన్పించుకోలేదు. తను పంపించిన వంద రూపాయలు దాచిపెట్టి దాచిపెట్టి పదిమందికీ చూపించుకునే తల్లి ఎంత సంబరపడిపోయిందో అతనికి తెలుసు. తల్లి కళ్ళల్లో.. ఆ ఉత్సాహం తేజస్సు ఎప్పుడూ నిల్చిపోవాలని రఘు రామ్ ఆశ.

శ్యామల కాఫీ తీసుకొని వచ్చి ఇస్తే ఆమెతోపాటు లోపలకి వెళ్ళి వాలు కుర్చీలో కాఫీ సిప్ చేస్తూ తల్లిని గుర్తు చేసుకోసాగేడు.

రఘురామ్‌ని ఎప్పుడూ చన్నీళ్ళ స్నానం చెయ్యనిచ్చేది కాదు జానకమ్మ. వంట చేస్తున్నప్పుడే పొయ్యి పక్కన పొంతకుండ పెట్టేది జానకమ్మ. పొయ్యి వేడికి పొంతలో నీళ్లు వెచ్చబడేది. ఆ పొంతకుండకీ, తల్లికీ ఏదో సంబంధం ఉంది అనిపించేది రఘురామ్‌కి. పొంతకుండ కూడా తల్లిలాంటిదే! (తనను తాను కాల్చుకుని ఎదుటి వాటికి సౌఖ్యం ఇస్తుంది పొంతకుండ. తల్లీ అంతే). ఒక రోజు తల్లి పొయ్యి దగ్గర కూర్చుని వంట చేస్తున్నపుడు హఠాత్తుగా అర్థమయింది రఘురామ్‌కి. తరచుగా తల్లికి వెన్నునొప్పి ఎందుకు వస్తున్నదో మునివేళ్ళ ఆధారంగా మోకాళ్ళపైకి వంగి పొయ్యి వూది, వూది.. రోజులు, నెలలు, సంవత్సరాల తరబడీ అదే భంగిమలో, జీవితంలో సగభాగం.. అదే భంగిమలో వుండటం వలన తల్లికి వెన్నునొప్పి వస్తుంది. చిత్రంగా ఆ ఊహ అతన్ని వణికించింది తన అమ్మమ్మ కూడా... ఆ వెన్ను నొప్పితోటే మర ణించింది అన్న వాస్తవం అతడిని విచలితుణ్ణి చేసిం ది. అతడు కొద్ది కొద్దిగా ఆలోచించ గలుగుతున్నాడు.

ఆ ఆలోచనకు ఏ సిద్ధాంతాల పేర్లూ అక్కర లేదు. ఒక మనిషి కష్టాన్ని నిస్సహాయంగా మరో మనిషి గమనించడం అది. తనకు కలిగిన కష్టం ఎందుకు కలిగిందో కూడా.. ఆ మనిషిని గుర్తించలే నప్పుడు మూలం వెతికే ఋషి మౌన వీక్షణ అది.

ఆస్తులు, అంతస్తులూ, అభిజ్యాత్యాలే కాదు. దోపిడీ, అణచివేత కూడా ఒక తరం నుంచి మరో తరానికి అందించబడతాయి అనడానికి తన అమ్మ మ్మ.. తన అమ్మ సాక్ష్యం అనుకున్నాడు రఘురామ్.

వృద్ధాప్యంలో తల్లిని అపురూపంగా చూసుకోవాలనీ.. అతను ఎంతో అనుకున్నాడు. ఆ ముచ్చట ఏదీ తీరకుండానే.. అతడు డిగ్రీలో ఉండగా తల్లి అతన్ని విడిచి వెళ్ళిపోయింది. తల్లి లేని లోటు అతడు భరించలేకపోయాడు.

తల్లి తనకు అన్నీ ఇచ్చింది. కానీ తను తల్లికి ఏమీ ఇవ్వలేకపోయాడు. "వెన్ను నొప్పిరా! చిన్నా" అంటూ తల్లి ఎంతలా విలపించిందో అతడికి తెలియంది కాదు.

అతడి కళ్ళ వెంట నీళ్ళు గంగ యమునలయి ప్రవించసాగేయి.

ఇప్పుడు తల్లి వెన్నునొప్పిని తను క్షణంలో

> **మనుషుల మీద ప్రేమాభిమానాలు పెంచుకోవడం చూశాం కానీ.. ఈ కుండ పెంకుల మీద ఏం ప్రేమో!"**

మాయం చెయ్యగలడు. అయినా ఇప్పుడు తల్లిలేదు.

తల్లి లేని లోటులోంచి అతడు సమస్త విశ్వాన్ని చూడటం నేర్చుకున్నాడు. స్త్రీ ఔన్నత్యానికి అతడు ప్రణమిల్లడం నేర్చుకున్నాడు.

తల్లి అతని జ్ఞాపకాలలో సజీవంగా ఉంది. చిన్నప్పుడు, ఎప్పుడూ తల్లి పెట్టే "పొంతకుడ" తల్లిని భౌతికంగా గుర్తుకు తెస్తుంది.

తల్లి అనుభవించిన వెన్ను నొప్పికీ, కష్టాలకీ పొంతకుండ మౌనసాక్షి. అందుకే అదంటే అతడికి ఎంతో ఇష్టం. ఎన్నేళ్ళు గడిచినా దానిమీద మమకారం అతడికి తీరలేదు.

బిగ్గరగా మాటలు విన్పించేసరికి ఇహంలోకి వచ్చాడు. శ్యామల ఎవరితోనో మాట్లాడుతోంది.

"లక్షలు పెట్టి ఇల్లు కట్టుకున్నామా? ఇంత అందమయిన ఇంటిలో దిష్టి బొమ్మలా ఇదెందుకు అంటే మా వారు వినరండీ మనుషుల మీద ప్రేమాభిమానాలు పెంచుకోవడం చూశాం కానీ.. ఈ కుండ పెంకుల మీద ఏం ప్రేమో!"

రఘురామ్‌కి చిన్నగా నవ్వొచ్చింది.

"మనిషికీ, మట్టికీ తేడా ఏం వుంది? ఒక దానిలో ఒకటి చివరకు ఐక్యం అయిపోవలసినవేగా! కుండ అంటే శ్యామలకు సాదా సీదా కుండే! కానీ తనకు తల్లిని గుర్తు తెచ్చే ఏకైక స్మృతి చిహ్నం''.వంటింట్లో పొంతకుండని జాగ్రత్తగా భద్ర పరిచాక అతడికి.. ప్రాణం హాయిగా అన్పించింది.

(జ్వలిత సంపాదకత్వంలో వెలువడిన "ఖమ్మం కథలు" నుండి...)

నాటి తరం వారి కథలు నేటి తరానికి
కథల వంతెన

నా కలంకబుర్లు

ఎవరు నేర్పారమ్మ
ఈ కలముకు
కమ్మని
కవితలను కూర్చమని.

ఎవరు చెప్పారమ్మ
ఈ కలముకు
ఆలోచనలకు
అక్షరరూపము నివ్వమని.

ఎవరు ఇచ్చారమ్మ
ఈ కలముకు
ప్రకృతిని అర్థంచేసుకునేశక్తి
పుటలపై భావాలనుపెట్టేయుక్తి.

ఎవరు అర్థించారమ్మ
ఈ కలమును
అందాలను అందించమని
ఆనందాలను పంచిపెట్టమని.

ఎవరు శాసించారమ్మ
ఈ కలమును
పూలకవితలను
పెక్కుటిని అల్లమని.

ఎవరు అడిగారమ్మ
ఈ కలమును
కాలాన్నికేటాయించమని
కడుకైతలను కాగితాలపైపెట్టమని.

ఎవరూ కోరారమ్మ
ఈ కలమును
రెచ్చిపొమ్మని
రసరమ్యగీతాలను రాయమని

ఎవ్వరూ
ఈ కలమును
నానుండి
లాక్కోవద్దు

ఎవ్వరూ
ఈ కలమును
నానుండి
వేరుచేయవద్దు

ఎవ్వరూ
ఈ కలాన్ని
గాయాలపాలు
చేయవద్దు

ఈ కలం
నా హృదయం
ఈ కలం
నా ప్రాణం

ఈ కలం
నా ఉచ్ఛ్వాస
ఈ కలం
నా నిశ్వాస

కలమే
నా ప్రతిక్షణం
కలమే
నా ప్రతిదినం

నా కలం
నా బలం
నా నేస్తం
నా జీవితం

-గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్
సెల్: 7981616630

సేల్స్ గర్ల్స్

చలువ మేడల్లో
ఉద్యోగమా కాదు ఉపాధి
రంగురంగుల డ్రెస్ కోడ్లు
పట్టపగలను తలపించే లైట్లు
తళ తళలాడే తమాషా వస్తువులు.

సందర్శకుల సమరోత్సహం
డిస్కౌంట్ 'ఉందా' అని డిమాండ్స్
కొనేది తక్కువ, వెతికేది ఎక్కువ
కొసరేది మాత్రం 'మరీ' ఎక్కువ.

విధిని ఎదిరిస్తున్న నుదురు
పగిలిన గాజు ముక్కల్లాంటి కళ్ళు
పాలిపోయిన చెక్కిళ్ళు
బెదురు పెట్టినట్టు లిపిస్టికులు
తెచ్చి పెట్టుకున్న చిరునవ్వులు
అలసి ఆకలితో తిరుగుతున్న ఆకారం
కొనుగోలుదారుల కొంటె ప్రశ్నలకు
కసురుకోకుండా సమాధానాలిచ్చే
ఓపికకు ప్రతిరూపం సేల్స్ గర్ల్స్.

కూర్చోవడానికి కుర్చీ ఉండదు
సాటి మనిషితో మాట్లాడడానికి సమయం ఉండదు
సుఫారీ తీసుకున్న హంతకునిలా
సూటేసుకొని తిరుగుతుంటడు సూపర్వైజర్
దేగ కళ్ళేసుకొని మూలకు నక్కిన కెమెరాలు
అబ్బబ్బ డ్యూటీ చేయడం ఎంత కష్టం.

షాపింగ్ కాంప్లెక్స్ , మల్టీప్లెక్స్ లు
సూపర్ మార్కెట్ ,హైపర్ మార్కెట్
బట్టల షాపులు, బంగారం షాపులు
చాలీచాలని జీతాలు
జీవనం పెరగని జీవితాలు
"నా" సే "నా"తక్ నౌకరిలు.

కార్పొరేట్ కార్యకలాపాల కార్యాలయాలు
సామంత వ్యాపారుల సామ్రాజ్యాలు
మరేమీ లేదు 'రంగం' మారిందంతే
"బతుకు" పల్లెను వదిలి పట్నం చేరిందంతే
"శ్రమ దోపిడీ" అంటే ఇదేనేమో
వాళ్ళు చెప్పింది ఇప్పుడు అర్థమవుతుంది

-డా. ఎడ్ల కల్లేశ్
9866765126

పాట ఓ చైతన్యం

ఒక్కప్పుడు ఎన్నెన్నో
ఉద్యమాల అలలపై ఓలలాడిన పాట...
అందరితో జతకూడి
నడియాడిన పాట...
అందరి మస్తిష్కంలో మెరిసి మురిసింది
అందరి మనుసులో విరిసి కురిసింది...
అంతులేని ప్రేమను పంచింది
కోట్లాది ప్రజల గుండెల్లో నిలిచింది...
అందుకే పాటకు దండం పెట్టాలి!!...
నా నుంచి ఎప్పుడో వెళ్లిన పాట
మొన్ననే కలిసింది...
నిండైన మానవత్వం తో
శ్రావ్యంగా ఆలపించిన పాట...
నన్ను చూసి కన్నీళ్లు పెట్టుకుంది!!..
ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేస్తూ
బోరున విలపించింది!!...
గుండెలో గూడు కట్టుకొన్న
కాలాన్ని తలుచుకొని కలత చెందింది...
అంతరిస్తున్న తన
విలువను తలుచుకుంటూ
తెలంగాణకు పురుడు పోసి
తన పొత్తిళ్ళలో జోలపాడిన పాట...
విస్తృత జనావళిని ప్రోగుచేసిన పాట...
ఉద్యమాలకు ఊపిరి పోసిన పాట...
నరనరాలో ఉత్తేజాన్ని కలిగించిన పాట
గలగలమంటూ గళంలోన
ఉప్పొంగిన పాట...
తెగువతో తోవ నడిపించిన పాట...
తెగింపుతో ప్రాణమై నిలిచిన పాట...
ఎన్ని రోజులకు కలిసింది!!??
కాలం అంతర్భాగంలో ఉండి
ఇప్పుడే బయటకి వచ్చింది...
ఎన్నేళ్ళయింది నిన్నుచూసి పాటమ్మ!!
నా గుండె ఊపిరిగా
నా మనసులో నిద్రించిన పాట...
ఈ రోజు నాపెదవులపై
ముద్దుపెట్టి గళాన్నిపలికించింది...
దళమై నాముందు నిలబడింది!!...
జనమంతా ఒక్కటై మధ్యలోన
పాట పళ్లు కొరుకుతూ
పిడికిలి బిగించింది...
యువతను నిద్ర లేపింది!!
భవితకు ఊపిరిపోసింది!!
చేలపై వాలింది..పూలపై రాలింది..
ఆకాశం తాకింది..
ఆలోచనలు పెంచింది!
నేలతల్లిని ముద్దాడి
నిలువెత్తు చైతన్యం నింపింది
కురిసిన వెన్నెలలో
నిలువెల్లా తడిసింది..మురిసింది!!
పొలాల మీద పొర్లి పాడింది
సెలయేటి దారుల్లో చెంగున ఎగిరింది
ప్రభాత సంధ్యాకాలంలో
పరవశించి పాడింది...
ప్రేమికుల హృదయాలలో
రసాత్మక భావాన్ని పలికింది...
ఎన్నెన్నో రంగాలలో
ప్రతిభకు ప్రాణం పోసింది...
అందుకే ఈ మానవ లోకం
పాటకు నీరాజనం పడుతుంది..!!
మనిషిలోని ఆత్మశక్తిని
జాగృత పరిచేది పాట...
అందుకే పాట
ఓ చైతన్య స్ఫూర్తినిస్తుంది!!...

-అంబటి నారాయణ.
9849326801

నానీలు

మనసు
గుప్పెడు
భావాలు
గంపెడు.

మనసు
ఒక్కటే
భావాలు
బొచ్చెడు

జీవితం
ఒక్కటే
అనుభవం

కోరికలు
కోలాహలం
తీరకపోతే
హలాహలం.

పున్నమి
రేయి
చిన్నబోయింది
చీకటి.



- బొబ్బిలి జోసెఫ్
సెల్:9989261991

పుస్తక సమీక్షలు

జనహితం పలికే- 'విజ్ఞాన దీపిక'

ప్రతులకు:
కోట శ్రీరామమూర్తి
సరస్వతినగర్, నెల్లూరు-524 002
ఆంధ్రప్రదేశ్.
సెల్: 9397878247

కోట శ్రీరామమూర్తి వారి తాజా పుస్తకము పేరు విజ్ఞాన దీపిక- అజ్ఞాన తిమిర సంహారిక. అమ్మవారికి ఈ విజ్ఞాన దీపికను అంకితమి చ్చారు. గతంలో వీరు నీతి సుధాలహరి, శ్రీరామ శతకము, శ్రీకృష్ణ లీలా శతకము, గీతామ కరందము పేరిట రచనలను అందించారు. ఈ విజ్ఞాన దీపికలో ముందుగా పద్యానికి హారతి పట్టారు పది పద్యాలలో. పద్యమె నా సర్వస్వము, వాని నా దేవి అంటూ చెప్పుకొచ్చారు. ఇక తమ శతకానికి పేరు విజ్ఞాన దీపిక అనడంతో పాటుగా అజ్ఞాన తిమిర సంహారిక అంటూ ఒక తోక తగిలించారు. మనం ఊహించినట్లుగానే ఎన్నో మంచి మాటలు మనకు కనిపిస్తాయి. ఒక విధంగా కొన్ని ఆటవెలదులు సుభాషితాలుగానే వున్నాయి. పెద్ద వారి చెంత బుద్ధిగా మెలగ వలయుననిచూ, పెద్దవారి మాట చద్దియన్నవు మూట, కన్నవారినెపుడు కష్టపెట్టగరాదు, కట్టుకున్న భార్య కన్నీరు పెట్టిన మంచి జరుగబోదు మగనికెపుడు, మగని మీది భక్తి మరువని కాంతకు ముజ్జగము లందు ముక్తి దొరకు, అర్థహీనుడైన ఆదరింపరు నిన్ను ఇలను చేయు తప్పులెల్ల ఈశుడెరంగు, బుద్ధి కుదురు లేక పూజింపఫలమేమి, కల్లమాట లాడ కలుగునా మోక్షమ్ము, కలిమిలేములు అనెడు కులములే రెండురా, మద్యసే వనమ్ము మనిషిని చెడగొట్టు వంటి పద్యాలు నేటి యువతకు ఒక విధంగా మార్గదర్శకాలు. ఎన్నో పద్యాల్లో మిత్రుల గురించీ, భార్యాభర్తల సంబంధాల గురించీ, ధర్మమార్గం గురించీ, నీతి న్యాయమూ, ఇలాంటి విషయాలపై శ్రీరామమూర్తిగారు చక్క గా తమ మనోభావాలను అందిం చారు. పూర్వ జన్మలోని పుణ్య పాపాల నేటి జన్మము నిలిచి వుంటాయనీ, ఈ జన్మలో ధర్మ మార్గంలోనే నడుచుకోవాలని హితవు పలికారు. ఎదుటివారిని చూసి ఈర్ష్య పడరాదం టారు.తానే గొప్ప వాడిననుకుని విర్రవీగరాదు అంటారు. ఈ విధంగా ఎన్నో జీవన సత్యాలనూ, ఆచరణ యోగ్యమైన సలహాల వంటి సూక్తులనూ, 'వాస్తవమ్ము కోటవారి మాట' అన్న మకుటంతో సులభశైలిలో తమదైన రీతిలో జనరంజకంగా రాసిన కోట శ్రీరామమూర్తిగారు అభినందనీయులు.

- డా॥ పులిపర్తి కృష్ణమూర్తి,
సెల్: 99490 92761

పడమరన కూడా సూర్యుడు ఉదయిస్తాడు

ప్రతులకు:
కొత్తపల్లి ఉదయబాబు
సెల్: 8558899478

కుటుంబ వ్యవస్థ, మరియు కుటుంబాల సమూహమైన సమాజంలోంచే కథానికలు పుట్టుకొస్తాయి. చరిత్రను కలబోసుకుని, కథలు అవుతాయి. కథల సమూహాలు నవలలుగా రూపాంతరం చెందుతాయి అని బలంగా విశ్వసించే కొత్తపల్లి ఉదయబాబు ప్రవృత్తిపరంగా కథలు, నవలలు వ్యాసాలు రాస్తారు. నటిస్తారు. టెలిఫిల్మ్స్ తీస్తారు. సంగీతం, సమాజసేవ వీరి గొప్ప వ్యాసకాలు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ఈ రచయిత అధ్యాపక వృత్తిలోనూ, తనదైన ప్రత్యేకత కనబరుచుతారు.

అందుకే వీరి కథల్లో సమాజం ప్రతిఫలిస్తుంది. సమాజంలోని మంచీ చెడులు అక్షరాలు అవుతాయి. అందుకే రవిబాబు రచనలు పత్రికలు, మరియు ప్రసార మాధ్యమాలు, అంతర్జాలాలు ఆదరిస్తాయి. అక్కున చేర్చుకుంటాయి. 30 కథలున్న ఈ సంపుటిలో కథలన్నీ, మానవత్వాన్ని ప్రదర్శిస్తాయి. "ప్రార్థించే పెదవులకన్నా.." లోని చక్రహస్తం ఆయన బృందం కావొచ్చు. "పడమటి సూర్యోదయం"లొని సూర్యకృష్ణకావచ్చు, 'వెన్నెల నీడ'లోని గాయత్రి కావొచ్చు. వీరందరూ పరిణతి చెందిన ఆదర్శమూర్తులే! కథలన్నింటా కాచి వడపోసిన సత్యాలే! గొప్ప అభివ్యక్తి, శైలి, శిల్పం, ఎత్తుగడ, మంచి ముగింపు- వీటన్నింటిపైన శ్రద్ధ పెట్టి రాయటం వల్లే పలు పత్రికలు ఈ కథల్ని ప్రకటించాయి. పారితోషికాలిచ్చి సమాదరించాయి. అరవై దాటిన జీవితాల చిత్రణ, సమాజంగా సాగుతూ మనసుకు హత్తుకుపోతాయి. 'అచ్చంగా తెలుగు' అధినేత్రి భావరాజు పద్మినీ ప్రియదర్శిని చెప్పినట్లు 'ఇవి చక్కని కథలు'. నిక్కమైన నీలాలు.

- కూర చిదంబరం
సెల్: 8639338675

పోరాటం తూర్పున ఉదయిస్తుంది

అరణ్యం విచ్చుకుంటుంది
ఆయుధం రాపిడి పెడుతుంది
జనం కన్నీళ్లు తుడవడానికి
పోరాటం తూర్పున ఉదయిస్తుంది.

ఆకాశం అనంతమవుతుంది
అంచుల్లో నక్షత్రాలు మెరుస్తాయి
వెన్నెల అగ్నిని కురుస్తుంది
చుక్కలు పొరపాటును పాడుతాయి.

సామాన్యుని దారి కన్నీటి ధార
కలల అడుగు ఆకలి తీర్చని వ్యధ
రాత్రి చీకట్లో కన్నుల నుండి
కన్నీళ్



బాల సాహిత్యం..దిశా నిర్దేశం

- రెండు రోజుల బాల సాహిత్య సమ్మేళనం పై విశ్లేషణ.....
- పాల్గొన్న అనేక మంది ప్రముఖులు...
- అనేక పుస్తకాల ఆవిష్కరణ

తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో డాక్టర్ వరప్రసాద్ రెడ్డి హార్దిక, ఆర్థిక సౌజన్యంతో మాతృమూర్తి శ్రీమతి కోడూరు శాంతమ్మ స్మారక బాల సాహిత్య సమ్మేళనం రెండు రోజుల (మే 29,30-2024) పాటు హైదరాబాదులో కన్నుల పండుగగా జరిగింది. రెండు తెలుగు ప్రాంతాలతో పాటు, ఇతర రాష్ట్రాల్లో నివసిస్తున్న బాల సాహితీ వేత్తలు, రచయితలు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు. వక్తలు విభిన్న అంశాలపై విస్తృత స్థాయిలో చర్చించారు. బాల సాహిత్యం తీరుతెన్నులు, వివిధ పోకడలు, జరుగుతున్న పరిణామాలు, కాలానుగుణమైన మార్పులు మొదలైన అంశాలపై పెద్ద ఎత్తున చర్చించి అటు బాలలకు, ఇటు బాల సాహితీ వ్యక్తులకు ఒక దిశా నిర్దేశం చేసినట్లు అయింది . మన సంస్కృతి సంప్రదాయాలను,ఆచార వ్యవహారాలను వారసత్వంగా అందించేందుకు బాల సాహిత్యమే ఏకైక మార్గమని గ్రహించేటట్లు చేసింది.

హైదరాబాద్ బొగ్గులకుంట లోని తెలంగాణ సారస్వత పరిషత్ ప్రాంగణంలోవున్న డాక్టర్ దేవులపల్లి రామానుజారావు కళామందిరంలో రెండు రోజుల పాటు సంబురమైన వాతావరణం కనిపించింది. దూర ప్రాంతాల నుండి విచ్చేసిన అందరూ ఎంతో ఆప్యాయంగా ఒకరికి ఒకరు పలకరించుకోవడం కొత్త అనుభూతి కలిగించింది సారస్వత పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శాంతా- వసంతా ట్రస్ట్ అధ్యక్షులు, పద్మభూషణ్ గౌరవ డాక్టర్ వరప్రసాద రెడ్డి రెండు రోజుల సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగేందుకు బాల సాహిత్యం బాలలకు ఎంతో కీలకమని అన్నారు. బాల సాహిత్యం బాలలకు చేరువ అయినప్పుడే ఈ కార్యక్రమానికి సార్థకత చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత సమాజంలో పిల్లలు ఎలాంటి పౌరులుగా తయారవుతారనేది పెద్ద సవాల్ గా మారిందని అయన ఆందోళన వ్యక్తం చేశారు. అమ్మ భాషను ఆదరిస్తూనే అవసరం కోసం అన్య భాష ఆంగ్లాన్ని నేర్చుకోవడంలో తప్పు లేదన్నారు. మన ఇతిహాసాలైన రామాయణ, మహాభారతాలను సరిగ్గా అర్థం చేసుకోకపోవడం వల్లనే ఎన్నికలలో రాజకీయ నాయకులు అసభ్య పదజాలాన్ని ఉపయోగిస్తున్నారని అభిప్రాయపడ్డారు. రాబోయే తరాలకు బాల సాహిత్యం మంచి విలువలు నేర్పాలని,దానికిగాను తన ఆర్థిక సహకారాన్ని ఇలాగే కొనసాగిస్తానని తెలియజేశారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న పూర్వ తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి మాట్లాడుతూ సమాజంలోని మంచి చెడులను చెప్పేది కవులు, రచయితలేనని వారు తమ కలాలకు పదును పెట్టి అక్షర బాణాలను ఎక్కుపెట్టాలని అన్నారు. నాణ్యమైన, నాలుగు కాలాలపాటు నిలిచి ఉండే బాల సాహిత్యాన్ని అందించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, నేటి బాలలకు మన సంస్కృతిని సాంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను తెలియజేసే విభిన్న ప్రక్రియలకు బాల సాహిత్యంలో చోటు కల్పించాలని, బాల సాహిత్యం యొక్క ప్రయోజనాలను విడమర్చి సమాజానికి తెలియజేయాలని అందుకు ప్రభుత్వ బడులే తావులుగా, ఉపాధ్యాయులే మార్గదర్శకులుగా మారాలని సూచించారు. ఇప్పటికే బాల సాహిత్యం రాశిలోనూ పెరిగిందని, నాణ్యతలోను మరింతగా పెరగాలని, అందుకోసం బాలసాహిత్యం రాస్తున్న బాల సాహితీవేత్తలను, రచయితలను మరింతగా ప్రభుత్వం ప్రోత్సహించాలని అభిప్రాయపడ్డారు. గౌరవ అతిథిగా పాల్గొన్న గరిపెల్లి అశోక్ రెండు రోజుల బాల సాహిత్య వర్క్ షాప్ సమావేశాన్ని తగిన సమన్వయంతో నిర్వహించడంలో కీలక పాత్ర వహించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలోనే బాలల కోసం సారస్వత పరిషత్ రూపొందించిన "భాషా సాహిత్య వైభవం", "ఆరోగ్యం- విజ్ఞానం", "పిల్లల కథలు" (1,2,3,45) ఐదు భాగాలు గల పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. ఈ సమావేశంలో పరిషత్తు కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్నయ్య, పైడిమరి రామకృష్ణ, చొక్కాపు వెంకటరమణ, దాసరి వెంకటరమణ, గరిపెల్లి అశోక్, అమరవాది నీరజ పాల్గొన్నారు.

మొదటి రోజు మొదటి సదస్సులో "బడిలో తెలుగు భాష " అనే అంశంపై ప్రముఖ బాలసాహితీవేత్త డాక్టర్ వి. ఆర్.శర్మ అధ్యక్షతన చర్చా గోష్ఠి జరిగింది. కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ దాసరి వెంకటరమణ విశిష్ట అతిథిగా పాల్గొని అనతి కాలంలోనే మాతృభాష అయిన తెలుగు మృత భాష అవుతుందని ఐక్యరాజ్యసమితి పేర్కొన్నదని అందుకుగాను భాషాభిమానులు మేల్కొని మాతృభాషను కాపాడుకోవాలని తెలిపారు. ఈ సదస్సులో పాల్గొన్న ప్రముఖులు బడిలో తెలుగు భాష ఎదుర్కొంటున్న సవాళ్లను తెలియజేస్తూ తమ తమ అభిప్రాయాలను సవివరంగా చర్చించారు. అమెరికా లాంటి దేశాలలో పాఠశాలల్లో పిల్లలు పుస్తకాలు చదవడానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారని అదే మన పాఠశాలలో కథల పుస్తకాలు ఇస్తే చించి వేస్తారనే అభిప్రాయం ఉండడం వల్లే కనీసం గ్రంథాలయంలోని పుస్తకాలను తెరవడం లేదని తెలిపారు. అలాంటి అభిప్రాయాలను తమ తమ మెదళ్ల నుండి తొలగించుకోవాలని బడుల్లో మాతృభాషా ఔన్నత్యానికి, స్థిరత్వానికి గట్టిగా పునాదులు పడాలని ఉపాధ్యాయులు సమన్వయంతో అమ్మ భాషను కాపాడుకునే విధంగా ప్రయత్నాలు జరగాలని సూచించారు. నేటి తరం పిల్లలలో ఉన్న మానసిక రుగ్మతలకు బాల సాహిత్యం ఒక అరకు కావాలని అదంతా అమ్మ భాష తెలుగు ద్వారానే సాధ్యమని 'నోమ్ చోమ్ స్కీ 'అనే ప్రముఖ విద్యావేత్త చెప్పిన మాటలను ప్రతి ఒక్కరు గుర్తుకు తెచ్చుకోవాలని కోరారు. డాక్టర్ ఉప్పల పద్మ సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ సదస్సులో కూకట్ల తిరుపతి, గోపగాని రవీందర్, పుల్లా రామాంజనేయులు, గోపగాని రవీందర్, సయ్యద్ షఫీ, బాల బోయిన రమాదేవి, గుళ్ళపల్లి తిరుమల కాంతి కృష్ణ, బద్రి కుర్మారావు, కొండూరు పోతన, అక్షరం ప్రభాకర్, చక్రవర్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అనంతరం రెండవ సదస్సు నేటి నిజం పత్రిక సంపాదకులు బైస దేవదాస్ అధ్యక్షతన "పత్రికలు- బాల సాహిత్యం " అనే అంశంపై చర్చా గోష్ఠి జరిగింది . ఈ సందర్భంగా దేవదాసు మాట్లాడుతూ అనేక సంవత్సరా లుగా నేటి నిజం పత్రిక పూర్తి పేజీని బాల సాహిత్యం కోసం ప్రతి బుధవారం కేటాయించిందని తెలియజేశారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న బాల చెలిమి సంపాదకులు మణికొండ వేద కుమార్ మాట్లాడుతూ నేటి సమాజంలో పత్రికలు బాల సాహిత్యానికి చేస్తున్న కృషిని కొనియాడారు. పత్రికలు కొంతవరకు నష్టపోతున్నప్పటికీ పిల్లల మీద ఉన్న ప్రేమతో సమాజ మార్పు కోసం పనిచేస్తున్నాయని, బాల సాహిత్యంలో వివిధ ప్రక్రియలు రాస్తున్న కవులను, రచయితలను ప్రోత్సహిస్తూ బాల సాహిత్యాన్ని ముందుకు నడిపిస్తూ బాలలకు చేరువయ్యేలా తపనతో పత్రికలు చేస్తున్నాయని తెలిపారు. పిల్లలు, పెద్దలు రాసిన అంశాలతో బాల చెలిమి పిల్లల పత్రికలను మళ్ళీ తీసుకువచ్చామని అన్నారు. ఈ చర్చా గోష్ఠి లో పాల్గొన్న వివిధ పత్రికల సంపాదకులు ఆయా పత్రికలలో బాల సాహిత్యం కోసం ఏ విధంగా కృషి జరుగుతుందో సవివరంగా తెలిపారు. గతంలో వచ్చిన బాల సాహిత్యాన్ని నెమరు వేసుకున్నారు. నేడు పత్రికలు చాలా ఆర్థిక ఇబ్బందులతో కొనసా గుతున్నాయని అయినప్పటికీ బాలలను ప్రోత్సహించే ఉద్దేశంతో బాల సాహిత్యా నికి పెద్ద పీట వేస్తున్నామని పేర్కొన్నారు. రాబోవు రోజులలో ఆన్లైన్లోనే చూడ వలసి వస్తుందని తెలిపారు. బాల సాహిత్య పత్రికలను ప్రభుత్వం మరింతగా ప్రోత్సహించాలని ఆర్థిక సహకారం అందించాలని వక్తలు అభిప్రాయపడ్డారు.

ప్రముఖ బాలసాహితీ వేత్త కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ సమావేశంలో విపుల, చతుర పూర్వ సంపాదకులు కంతేటి చంద్ర ప్రతాప్, మొలక సంపాదకులు వేదాంత సూరి, చెకుముకి నిర్వాహకులు రాజా, సాహితీ కిరణం బాధ్యులు పొత్తూరి సుబ్బారావు, బాలల నేస్తం సంపాదకులు డాక్టర్ నెమిలేటి కిట్టన్న, గడుగ్గాయి పత్రికా నిర్వాహకులు కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం మూడవ సదస్సు డాక్టర్ చొక్కాపు వెంకటరమణ అధ్యక్షతన "కథ చెప్పే కళ " అనే అంశంపై చర్చ గోష్ఠి జరిగింది. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ కథలు ఏ విధంగా చెప్పాలో , కథలు చెప్పేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి, కథను ఎలా చెబితే పిల్లలు వింటారో అనే అంశాలపై అనేక మెళుకువలు అందించారు. ఇందులో పాల్గొన్న డాక్టర్ ఎం హరి కిషన్ ఒక కథను ఉదాహరణకు తీసుకుని ఎంతో సృజనాత్మ కంగా చెప్పారు. కథ చెప్పే విధానం అందరినీ ఆలోచింపజేసింది. అనంతరం ఎన్న వెళ్లి రాజమౌళి మరో కథను కూడా ఉదాహరించారు. కథలు చెప్పడంలో మొదటగా మనలో ఆసక్తి ఉండాలని, కథలు చెప్పేటప్పుడు హావ భావాలను ప్రదర్శించాలని సన్ని వేషాలకు తగ్గట్టుగా కథలు బోధించాలని, పిల్లలను కథల వైపు దృష్టి పడేలా చూడాలని అన్నారు. ఈ సదస్సులో సమ్మెట ఉమాదేవి, మనోజ, దివ్య, పద్మ, ప్రమీల, కృష్ణ చైతన్య, సుబ్రహ్మణ్యం, తదితరులు కథలు చెప్పె విధానం పై మాట్లాడారు. శ్రీమతి రమాదేవి కులకర్ణి సమన్వయకర్తగా వ్యవహరించారు.

తదుపరి రెండవ రోజున నాలుగో సదస్సులో "లలిత కళా పరిచయ" అంశంపై బాల వికాస కారులు శాంతారావు అధ్యక్షతన జరిగింది. శాంతారావు మాట్లాడుతూ పిల్లల సర్వతో ముఖాభివృద్ధికి లలిత కళలు కూడా ఎంతో దోహదపడతాయని అన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ప్రముఖ విద్యావేత్త, రచయిత్రి డాక్టర్ జి. అమృతలత పిల్లల సంపూర్ణ మూర్తిమత్వానికి చతుషష్టి కళలు ఎంతో ఉపయోగమని , కానీ తల్లిదండ్రులలో కళల పట్ల పెద్దగా శ్రద్ధ లేదని అందుకుగాను తల్లిదండ్రులు, సమాజం ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు.

అనంతరం సమావేశంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ సంగీతం, నృత్యం, నాటకం, చిత్రలేఖనం, శిల్పం, జానపద కళలు పిల్లల మనోవికాసానికి ఏ విధంగా దోహదపడతాయో సవివరంగా తెలిపారు. పాఠశాలల్లో ఉన్న పిల్లలకు ఈ కళల పట్ల ఆసక్తి ఎట్లా కలిగించాలో అందుకుగాను ఉపాధ్యాయులు చేయవలసిన బాధ్యతలు ఏమిటో అనే మొదలైన అంశాలపై తగిన సూచనలు సలహాలు అందించారు. ఈ సమావేశంలో ప్రముఖ సంగీత విద్వాంసురాలు మాడభూషిణి రాజ్యలక్ష్మి , ప్రముఖ నర్తకి కోకా విజయ లక్ష్మి, ప్రముఖ రంగస్థలం నటులు, దర్శకులు బీచ రాజు శ్రీధర్, ప్రముఖ చిత్రకారులు జె. వెంకటేశ్వర్లు, జానపద కళాకారులు గజవెల్లి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా అధ్యాపకులు, కళాకారులు కోకిల నాగరాజు వ్యవహరించారు.

అనంతరం జరిగిన ఐదవ సదస్సులో " బాల సాహిత్యం -ప్రమాణాలు " అనే అంశంపై చర్చా గోష్ఠి ప్రముఖ బాలసాహితీ వేత్త శ్రీమతి ముంజలూరి కృష్ణకుమారి అధ్యక్షతన జరిగింది. విశిష్ట అతిథిగా పాల్గొన్న శ్రీమతి మాడభూషి లలితా దేవి మాట్లాడుతూ బాల సాహిత్యం అంటే ఏమిటి? బాల సాహిత్యానికి ఉండవలసిన ప్రమాణాలు ఏమిటి? వంటి అంశాలపై మాట్లాడారు.. ఇందులో పాల్గొన్న ప్రముఖ వక్తలు మాట్లాడుతూ బాల సాహిత్యంలో పాటించవలసిన నియమాలు, వస్తువు, విషయం , రాశి వాసి, ఎలా ఉండాలి అనే అంశంపై విస్తృతంగా చర్చించారు. ఏది బాల సాహిత్యం అనడానికి బాలలకు ఏది చేరువవుతుందో అదే బాల సాహిత్యంగా పరిగణించాలని, అదే ప్రమాణంగా పాటించాలని, మెరిసేదంతా బంగారం కానట్లు రాసేదంతా బాల సాధ్యం కాదని, కొంతమంది రచయితలు పేరు కోసం ఏదో రాస్తున్నట్లు ఉన్నారని, ఇది సరైన విధానం కాదని పేర్కొన్నారు. అట్లా అని ఏది పడితే అది రాయొద్దని, సున్నిత మనసులైన బాలలకు నష్టం కలిగించొద్దని హితవు పలికారు. పిల్లల స్థాయిని బట్టి ఆసక్తి కలిగించే విధంగా తగిన బొమ్మలతో కథలు,గేయాలు అనేక ప్రక్రియలు నాణ్యతతో రావాలని అందుకుగాను బాల సాహిత్య రచయితలు తగిన ప్రమాణాలు పాటించాలని తెలియజేస్తూ అనేక సూచనలు చేశారు. ఈ సదస్సులో గంగిశెట్టి శివకుమార్, పుప్పాల కృష్ణమూర్తి, పైడిమర్రి రామకృష్ణ , ఉంద్రాల రాజేశం, టి.వి. రామకృష్ణ, ఆర్ సీ కృష్ణస్వామి రాజు, డాక్టర్ సాగర్ల సత్తయ్య, బి వి ఎస్ స్వామి, సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ అమరవాది నీరజ సమన్వయకర్తగా వ్యవహరించారు. అనంతరం జరిగిన ఆరో సదస్సులో " బాల సాహిత్యం -గ్రంథాలయాలు " అనే అంశంపై సి.ఏ ప్రసాద్ అధ్యక్షతన చర్చా గోష్ఠి జరిగింది. విశిష్ట అతిథిగా స్వచ్ఛంద గ్రంథాలయ నిర్వాహకులు శీల అవిలేను పాల్గొని మాట్లాడుతూ బాల సాహిత్యానికి గ్రంథాలయాలు ఈ విధంగా ఉపయోగపడుతున్నాయో, భవిష్యత్తులో బాలలకు ఇంకా ఎట్లా ఉపయోగపడాలో తెలిపారు. గ్రంథాల యంలోని పుస్తకాలను బాలల కు ఎట్లా అందించాలో, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో మొదలైన అంశాలను అందించారు. డాక్టర్ కాసర్ల నరేష్ రావు సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ సదస్సులో కూచిమంచి నాగేంద్ర, పరుశరాములు, ప్రవీణ్ శర్మ, కందుకూరి భాస్కర్, రమేష్ వెంకటనారాయణ, సుమిత్ర దేవి, పోరెడ్డి అశోక్, మహేశ్వర్, కిరణ్ కుమారి, దుర్గం బైతి తదితరులు పాల్గొన్నారు.

తదుపరి చివరి ముగింపు సమావేశం ఆచార్య ఎల్లూరి శివారెడ్డి గారి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో విశిష్ట అతిథిగా తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన మండలి డైరెక్టర్ శ్రీమతి ఎం. రాధారెడ్డి పాల్గొని మాట్లాడారు. బాల సాహిత్యం పై రెండు రోజులపాటు సారస్వత పరిషత్తు కొనసాగించిన కృషిని కొనియాడారు. బాలసాహిత్యానికి బడులలో పెద్దపీట వేయగలమని హామీ ఇచ్చారు. బాల సాహిత్యం బాలలకు మరింత చేరువ కావాలని అందుకు పాఠశాలలు ప్రధాన కేంద్రాలుగా మారాలని ఆశించారు. పాఠశాలలో ఉన్న గ్రంథాలయాలలోని పుస్తకాలు విద్యార్థులకు ఉపాధ్యాయులు అందించాలని పుస్తక పఠనానికి ప్రాముఖ్యతను ఇవ్వాలని కోరారు. పాఠశాలలో బాలసభలు నిర్వహించి పిల్లలలో దాగి ఉన్న సృజనాత్మక శక్తులను వెలికి తీయాలని అప్పుడే విజ్ఞానవంతమైన సమాజం రాగలదని అందుకు గాను బాల సాహిత్య వేత్తలు మరింత కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న మోడల్ స్కూల్ సంయుక్త సంచాలకులు , రచయిత్రి పాలడుగు సరోజినీ దేవి మాట్లాడుతూ పిల్లల కోసం మంచి బాల సాహిత్యం రాస్తున్న రచయితలను అభినందించారు. బాల సాహిత్యం ద్వారానే పిల్లల్లో మార్పు వస్తుందని అందుకుగాను పాఠ శాల స్థాయి నుండే బాల సాహిత్యం పట్ల మక్కువ పెరిగేలా ఉపాధ్యాయ రచయితలు తగినంత శ్రద్ధ వహించాలని కోరారు. నేను కూడా ఒక రచ యితనేనని, ఒక కథ రావాలంటే ఎంత వేదన ఉంటుందో తెలుసునని అన్నారు. అనంతరం సారస్వత పరిషత్తు కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య మాట్లాడుతూ పిల్లల కోసం రూపొందించిన పుస్తకాలు ప్రభుత్వ పాఠశాలలకు అందేలా చూడాలని రాష్ట్ర విద్యా పరిశోధన మండలి డైరెక్టర్ రాధారెడ్డిని కోరారు. అందుకు తగిన చర్యలు తీసుకుంటామని రాధారెడ్డి ఇచ్చిన హామీ కార్యశాలలో భరోసా లభించినట్లు అయింది. ఈ బాల సాహిత్య సమ్మేళనానికి రామానుజ చారి, సత్యనారాయణ మూర్తి, సంగ నభట్ల చిన రామకిష్టయ్య, షేక్ అబ్దుల్ హకీం జాని, లక్ష్మణరావు, వడ్డేపల్లి వెంకటేష్, జానకీరామ్ తదితరులు కూడా హాజరైనారు. రెండు రోజుల పాటు సుదీర్ఘంగా జరిగిన బాల సాహిత్యం కార్యశాలలో నిర్వహించిన ఆరు సదస్సులలో అనేక మంది ప్రముఖులు పాల్గొని బాల సాహిత్యం పై విస్తృతంగా చర్చించారు. ప్రతి సదస్సులో జరిగిన చర్చలు ఆలోచింపచేసినవి. తెలంగాణ సారస్వత పరిషత్ రూపొందించిన పుస్తకాలనే కాకుండా బాల సాహితీ వేత్తలు, రాసిన చందమామలో మేనమామ, బహుమతి, పిల్లల జాబిల్లి, బాల రత్నాలు, పసిడి మొగ్గలు , చిగురింతలు, ఆనందలహరి , శ్రీకృష్ణ శతకం , పిల్లల మనసు, బుడుగో...బుడుగో వంటి వే కాకుండా పత్రిక ఎడిటర్లు రూపొందించిన బాల చెలిమి, మొలక , చెకు ముకి, బాలల నేస్తం,మొదలగ అనేక పుస్తకాలను వివిధ సదస్సులలో ప్రము ఖుల చేతుల మీదుగా ఆవిష్కరించబడినవి. రచయితలు రాసిన ఉత్తమ కథలకు ఏడుగురికి నగదు పురస్కారం సారస్వత పరిషత్ వారు అందించడం మరింత ప్రోత్సహించే విధంగా అనిపించింది. బాల సాహిత్యకారులకు ఈ వర్క్ షాప్ దిశ నిర్దేశం చేస్తూ సరైన తోవలో పయనించేలా చేసిందని చెప్పవచ్చు. ఇందులో బాలసాహిత్య రచయితలు, తమ అభిప్రాయాలను ఒకరికి ఒకరు పంచుకున్నారు . తగిన మెలకువలు తెలుసుకున్నారు.

రాబోవు రోజులలో కూడా తెలంగాణ సారస్వత పరిషత్ ఇటువంటి సమావేశాలు ప్రతి ఏటా నిర్వహించి బాల సాహిత్యం బాలలకు మరింతగా చేరువయ్యి మార్పులకు, విలువలకు శ్రీకారం చుట్టుతుందని, మరింతగా భరోసా కలిగిస్తుందని మనమందరం ఆశిద్దాం.

-కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి,
బాల సాహితీవేత్త. ఫోన్ : 9441561655

జూన్ 1న రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాలులో శీలావీ సాహిత్యచిత్రకళా వేదిక నిర్వహించిన సభలో పుష్పాల శ్రీరామ్ (1818 దీర్ఘ కవిత)కు శీలావీర్రాజు కవిత్వ పురస్కారం, అన్వర్‌కు శీలావీ చిత్రకళా పురస్కారం ప్రదానం చేస్తున్న డా॥ నాళేశ్వరం శంకరం, డా॥ ఎన్.గోపి, కె.శివారెడ్డి, వాడ్రేవు చినవీరభద్రుడు, శీలా సుభద్రాదేవి, శీలా పల్లవి.

సభలో ప్రసంగిస్తున్న శీలా సుభద్రాదేవి.

భాషా సాంస్కృతికశాఖ, తెలంగాణ ప్రభుత్వం సౌజన్యంతో

అమరవాది ఫౌండేషన్

సాహిత్య, సాంస్కృతిక సంస్థ నిర్వహణలో

శ్రీమతి అమరవాది హైమవతీ-డా.ఎ.సి.ఎం.ఎల్. ప్రసాద్ సాహిత్య పురస్కారం

పురస్కార గ్రహీత : ఆచార్య సి. మృణాలిని

డా.ఎ.సి.ఎం.ఎల్. ప్రసాద్-శ్రీమతి హైమవతి బాల సాహిత్య పురస్కారం

పురస్కార గ్రహీత : శ్రీ గరిపెల్లి అశోక్

డా. అమరవాది నీరజ

బాలల కథలు 'ఏడు రంగుల జండా' పుస్తకావిష్కరణ

13 జూన్, 2024 గురువారం, సాయంత్రం 6 గంటలకు,
సమావేశ మందిరం, మొదటి అంతస్తు, రవీంద్ర భారతి, హైదరాబాద్

ముఖ్య అతిథి
శ్రీ మణికొండ వేదకుమార్
సంపాదకులు, బాలచెలిమి బాల వికాస పత్రిక & దక్కన్ లాండ్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమి

అధ్యక్షులు
డా. పత్రిపాక మోహన్
దక్షిణ ప్రాంత అధికారి, నేషనల్ బుక్ ట్రస్ట్, భారత ప్రభుత్వం

విశిష్ట అతిథులు
డా. జూరు చెన్నయ్య
కార్యదర్శి, తెలంగాణ సారస్వత పరిషత్తు
శ్రీ చొక్కాపు వెంకటరమణ
సాహిత్య అకాడమి బాల సాహిత్య పురస్కార గ్రహీత

అమరవాది ఫౌండేషన్ సౌజన్య
డా. అమరవాది నీరజ (అధ్యక్షులు) ● ఎ. సీతారాం (ఉపాధ్యక్షులు) ● చింతకింది మాల్యా (ప్రధాన కార్యదర్శి) ● డా. హారిక చెరుకుపల్లి (నిర్వాహక కార్యదర్శి)

తెలుగు సాహిత్యానికి అస్తిత్వ ఉద్యమాలతో మేలు

సభలో ప్రసంగిస్తున్న నందిని సిధారెడ్డి

హైదరాబాద్, జూన్ 5 : (నేటినిజం ప్రతినిధి): అస్తిత్వ ఉద్యమాలు తెలుగు సాహిత్యానికి ఎంతో మేలు చేశాయని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షులు డా॥ నందిని సిధారెడ్డి అన్నారు. ప్రత్యేక తెలంగాణ అస్తిత్వ ఉద్యమం బలంగా సాగిందని, అది సాధించే వరకు తీసుకెళ్లిందన్నారు. సోమవారం హిమాయత్‌నగర్ మఖ్దూమ్ భవన్‌లో తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఆధ్వర్యంలో తెలంగాణ, దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో 'కష్టజీవికి ఇరువైపులా నిలిచిన కవుల కవితాగానం' శీర్షికన ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అరసం అధ్యక్షుడు, కవి పల్లేరు వీరాస్వామి అధ్యక్షతన జరిగిన సభలో డా॥ నందిని సిధారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. అరసం సమాజంపై బాధ్యతగా ఉంటుందన్నారు. అరసం ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్ మాట్లాడుతూ కవులు ఎప్పుడు ప్రజల పక్షంగా ఉండ కవితలు రాయాలన్నారు. అరసం ఉపాధ్యక్షులు నిధి మాట్లాడారు. కవులు డా॥నాళేశ్వరం శంకరం, కన్నం లక్ష్మీనారాయణ, ఎస్. విజయభాస్కర్, జి. చంద్రమోహన్‌గౌడ్, రాపోలు సుదర్శన్, నాంపల్లి శ్రీనివాస్, కందుకూరి శ్రీరాములు, ఎస్. జగన్‌రెడ్డి, బెల్లంకొండ సంపత్‌కుమార్, వద్దిరావు ప్రవీణ్‌కుమార్, బూర భిక్షపతి, బొమ్మగాని నాగభూషణం, వేముల నారాయణ, ఏముల సుధాకర్, కాసర్ల సరోజాదేవి, కాసర్ల రంగారావు, ఎస్. సూర్యప్రకాష్, దొంతరబోయిన దైవాదీనం, సోమశిల తిరుపాల్, తదితరులు తమ కవిత్వంను వినిపించారు.

జూన్ 2న నిజామాబాద్‌లో హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ అవతరణ దశాబ్ది ముగింపు ఉత్సవాల్లో ప్రసంగిస్తున్న తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా॥వి.శంకర్. వేదికపై సి.హెచ్. ప్రకాశ్, నరాల సుధాకర్, ఘనపురం దేవేందర్, పంచరెడ్డి లక్ష్మణ్, డా॥ కాసర్ల నరేష్‌రావు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1163వ రోజు ' వ్యంగ్యం' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. ' వ్యంగ్యం' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా...

-సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు,9441046839

పోటు

నరం లేని నాలుక
ఆక్రోశం, ఉక్రోషాలతో ఆడుతుంది
ఇతరులను దుమ్మెత్తి పోస్తూ
తాను మహా గొప్ప అనే డంబం
డాంబికాలకు అడ్డా.
నర్మగర్భంగా
శల్యుడు కర్ణుని సాధించిన తీరు
పెళ్లి పాటల్లో వియ్యాలవారిని
ఇరుకున పెట్టే.
అత్తా ఆడపడుచులపై పాటలు
హాస్యం, నవ్వులు మజా.
ఆనాటి ప్రసిద్ధ కవులు
సాహితీవేత్తల
మాటలు అరటిదూటలు
లోతుగా వెళ్తే కందిరీగ కాట్లు.
ఆనాటి రాజకీయ వేత్తలు
పార్లమెంటు లో ప్రతిపక్షాలని
దులిపేసే మాటతీరు
అధికారంలో ఉన్న నేతల్ని
నిలదీసే తీరు ప్రశంసనీయం.
ఆనాటి చురకలు, చెళుకులు
నవ్వులు పువ్వులు రువ్వినతీరు
చరిత్ర లో శాశ్వతం
తెనాలి రామకృష్ణుని
హాస్య, వ్యంగ్య బాణాలు
బీర్బల్
కర్రవిరగకుండా
పాముచావకుండా
వ్యవహరించిన తీరు ఆదర్శం.
సత్యభామ వ్యంగ్య బాణాలు
అలకలు
నల్లనయ్య నవ్వులు
కుటుంబంలో సరదాలు
కురిపిస్తాయి హాస్యపు జల్లులు.
నేడు మనసంతా
చేదు విషంతో
ఎదుటివారిపై కసితో
గుండెను చీల్చి చెండాడే వ్యంగ్యం
సున్నితమనస్కుల
ఉసురు తీస్తుంది
నేడు
ఎద్దేవాలు, ఎకసెక్కాలు
రణరంగం
వీరంగంగా మారి
రాష్ట్ర, దేశ పరువు తీసే బదులు
సూటిగా
నిర్మొహమాటంగా
మర్యాదగా
సమయానికి తగుమాటలాడడం
మేలుగదా!
ఆలోచించి అడుగేస్తే
పరువు నిలుస్తుంది కదా!?.

-ఎ.రాజ్యశ్రీ

చక్కటి చక్కిలిగిలి

అత్త కు కోడలు ఎప్పుడూ
వ్యంగ్యం కోసం వాడే అస్త్రం
బావా మరదళ్ల వ్యంగ్యం
చిర పరిచితమే
రాజకీయ నాయకుల వ్యంగ్యం
అబ్బ అబ్బ కంపు కంపు
కులం మతం కుంపట్లో
కాలే వ్యంగ్యం
అమ్మమ్మ ప్రమాదమే
వ్యంగ్యం చక్కని
చక్కిలిగిలిలా ఉండాలి
ఒంటరిగా ఉన్నా
పెదవులపై నవ్వుగా విరియాలి
అప్పుడప్పుడు తప్పు ను
తెలిపే అస్త్రంగా
దిద్దుబాటు దారి దూత కావాలి.
ఇదే ఇదే నేనెరిగిన
నికరమైన వ్యంగ్యం
చక్కటి చక్కిలిగిలి
ఈ వ్యంగ్యమే.

-ప్రశాంతి రేవూరి

విమర్శ

అదొక ట్రిక్
కొందరికే పరిమితం
ఎదుటి వ్యక్తిని
నేరుగా విమర్శించని
ఒక ఆయుధం
అవతలి వ్యక్తి మనోభావాలు
ఎంత దెబ్బ తింటాయన్నది
వాళ్ళకి లేక
వ్యంగ్య బాణాలు వదిలి
మనసు ఎంతో కష్ట పెట్టి
విసుగు తెప్పించి
విరామం లేకుండా
ఆలోచన రాకుండా
మహా మాటల మాయాజాలంతో
పరుగులు పెట్టిస్తారు.
శాడిస్టు విధానంలో వీరు
సమాజానికి భారం
ఎన్నోజీవితాలతో
ఆడుకుంటూ ఉంటారు.

-నారుమంచి వాణీ ప్రభాకరి

పదునెక్కువ

మనిషికి మాట్లాడటం
దేవుడిచ్చిన వరం
వరం అందరికీ వున్నా
కొందరికి అదొక కళ
మాటలతో అందర్నీ
మెప్పించలేం
కానీ
నొప్పించక పోవటమే
విజ్ఞుల లక్షణం
సప్త వర్ణాల కలయిక
ఇంద్ర ధనుస్సు
సప్త భావాల కలయిక
మనిషి మాట
కొన్ని భావాలు కలిగిస్తాయి సాంత్వన
మరికొన్ని కలిగిస్తాయి మనోరంజనం
వ్యంగ్యానికి
రెండు వైపులా పదునే
నర్మగర్భంగా అవమానం
నోటితో మాట
నొసటితో వెక్కిరింపు
కొన్నిసార్లు
అవతలి వారిని
సరిదిద్దే ప్రక్రియ కూడా
కొందరికి
అసూయ వెల్లడించే ప్రక్రియ
అంతరంగం తేట తెల్లం
వ్యంగ్యం పదునైన ఆయుధం
వ్యంగ్య చిత్రాలతో
మనో రంజనమందిస్తూ
రాజకీయ మాలిన్యం
కడిగేసే వ్యంగ్యం.

-మోటూరి శాంతకుమారి

హాస్యం పండించాలి

వ్యంగ్యం హాస్యం పండించాలి
మనస్సు బాధకు గురికావొద్దు
లోకహితంగా ఉండాలి
తిండికి తిమ్మరాజు
పనికి పోతరాజు
విత్తు ఒక్కటైతే
చెట్టు వేరొక్కటి అవుతుందా
తల్లి తీరు పిల్లలు
ఆవు చేలో మేస్తే
దూడ గట్టున మేస్తుందా
అవ్వేద్వంగ బిడ్డేడ్చినట్లు
పలుకే బంగారమాయె అన్నట్లు
తానొకటి తలిస్తే దైవం
ఒక్కటి తలచినట్లు
ఇంతింతై వటుడింతై అన్నట్లు
నోరు పలుకరించే
నొసలు ఎక్కిరించే అన్నట్లు
ఏ ఎండకాగొడుగు పట్టినట్లు
కాసే చేట్టునే రాళ్ళతో కొట్టినట్లు

ఎకసెక్కం

భావోద్వేగాలలో
భయంకర చర్య
వ్యంగ్యం
క్రూరాతి క్రూరం.
అవహేళన
అవమానం
ఎదుటివారి మనసు నొప్పించడం
మానవత్వపు ఛాయ
మరుగున పడడం.
సంతోష భాషణం
చక్కగా ఉంటే
వ్యతిరేక భావ వ్యక్తీకరణ
విధ్వంసకాండకు దారి
వ్యంగ్యం, వెక్కిరింత
మనిషిలోని
దౌర్భాగ్యపు గుణానికి సూచికలు
ఎదుటివారి అమాయకత్వాన్ని
ఆసరా చేసుకుని
బాధ కలిగించే
మారణ ఆయుధాలు.
మంచి భరించలేక
కక్షతో ఉపయోగించే అస్త్రం
నీచ ప్రకృతితో
ఎదుగుదల ఓర్వలేక
గొప్పతనం భరించలేక
ప్రయోగించే
నీచాతి నీచమైన చెణుకులు
వ్యంగ్యం, ఏకసెక్కెం, అపహాస్యం !!!.

-కె.కె.తాయారు

మాటల నేర్పు

మాట్లాడటం ఒక కళ
మెప్పించటం భళా
అటు ఇటైతే గోల
నొప్పించక
తానొవ్వక
హాస్యం జోడిస్తూ
చమత్కరిస్తూ
సుత్తిలేకుండా సూటిగా
గేళి చేసినా
సున్నిత వ్యంగ్యం
దైనందిన జీవనంలో
మంచి ప్రయోగం
తప్పును సుతిమెత్తని నేర్పుతో
ఎత్తి చూపి...
నవ్విస్తూనే....
వ్యతిరేకించటం..
వ్యంగ్య ప్రహసనం.

-జె.నరసింహారావు

ఉల్లాస హేతువు

అష్టదిగ్గజాల్లో విశిష్టుడైన
వికటకవి తెనాలి కూడా
వింత చేష్టలను
కొంత కలిగించే హాస్యం
విదూషకుడై రాజుకు, ప్రజలకు.
తూటాలను పేల్చే
తుపాకి రామయ్య పాత్ర
తూర్పార పడుతూనే
తుత్తునియలు చేస్తూనే
నవ్వుల పొట్లం విప్పి
నట్టింట్లోనే నవ్విస్తుంటాడు
వ్యంగ్య జంగమయ్య
చాప్లిను చిరునామయినా
పిల్లలకు పెద్దలకు ఉల్లాస హేతువులే
వింతగల ఆకారంతో విసుగులను
దూరం చేస్తూ.....
దర్శనమే దరిచేరుస్తుంది ఆనందం
మాటలు కోటలై దాటిపోతుంటే
మనకు కూడా ఎంతో కొంత
తారసమే నిత్య జీవితంలో.
కొంతమంది
కపట వ్యంగ్యాలతో
కళ్ళాపి జల్లి
సప్తవర్ణాలతో ముగ్గులేసే
కరటక దమనకులుంటారనే నిజం
కనిపెట్టుకుని కదలాలి లోకంలో ....

మితమైతే మధురం

ఎత్తుకున్నట్టే ఉంటూ
ఎత్తిపడేసే కళ
పొగడ్తలతో ముంచెత్తుతూ
మనసారా తెగిడే కళ.
రెండు దిక్కుల
సమర్థించుకునే వీలైన కళ
అందరితో కానిదీ
అబ్బురపరిచే కళ.
సాహితీ పరులకూ
సాధించే అత్తలకూ
సాధనలేకుండా అచ్చొచ్చే కళ.
సత్యమైనా ఉండొచ్చు
అక్కసునైనా తెలుపొచ్చు.
పలికే పదాలకూ
ముఖకవలికలకూ
పొంతనలేకుండా
కడుపులోని కసి కక్కేయవచ్చు.
మాట్లాడే మాటల్లో సత్యమేదో
అసత్యమెంతో
వినేవాడికి ప్రశ్నగా వదలవచ్చు.
నల్లని వాడిని
చంద్రునితో పొగడవచ్చు
పున్నమిదా?
అమావాస్యదా?
నర్మగర్భంగా చూపొచ్చు
మితిమీరక
సత్యం వదలక
తగిలినా భరించేట్టుగా
హాస్యభరితంగా
ఆలోచింపచేసేట్టుగా
అందంగా చెప్పగలిగితే
వ్యంగం ఆవకాయలో ఇంగువే.

-గుర్రాల వేంకటేశ్వర్లు

సందర్భోచితంగా మాట్లాడినా
ఎదుటి వారిలో
పరివర్తన కల్గించే విధంగా ఉండాలి
మనస్సును గాయ పరచొద్దు
కనువిప్పును కల్గించాలే కాని
కవ్వింపులకు గురిచేయరాదు
చేతులు కాలాక ఆకులు
పట్టుకుని లాభం ఉండదు
వంగ్యం పగ తీర్చుకోవడానికి
పని ముట్టుగా మారొద్దు
ఎండమావి కారాదు
మనిషిలో పరివర్తన కల్గించే
దివ్య ఔషధం కావాలి.

-గుండం మోహన్ రెడ్డి

ఇందూరు ప్రజలు గర్వించేలా పనిచేస్తా- ఎంపీ ధర్మపురి అరవింద్..

నిజామాబాద్, జూన్ 5 : నాపై నమ్మకం ఉంచి ఎన్నికల్లో మరోసారి ఎంపీగా ఆశీర్వదించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ.. ఇందూరు ప్రజలు గర్వించేలా పనిచేస్తానని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. దమ్ముంటే అభివృద్ధిలో పోటీ పడుదామని కాంగ్రెస్ వాళ్లకు ఎంపీ ధర్మపురి అరవింద సవాల్ విసిరారు. ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేసి ప్రజలకు అందుబాటులో లేకుండా బుగ్గ కారులో సైరన్ ఉంటే చాలు అంటూ బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పై ఎంపీ ధర్మపురి అరవింద్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ వాళ్లకు స్వలాభం తప్ప ప్రజా సంక్షేమం పట్టదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో భారీ మెజార్టీ ఇచ్చి గెలిపించిన ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఇప్పటివరకు ప్రజలకు ఉపయోగపడే ఒక్క పనైనా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చేశారా అని ప్రశ్నించారు.

ఎన్నికల్లో బోధన్ ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలకు అందుబాటులో ఉండకుండా పదేపదే అధి కారులను బెదిరించడం తప్ప అభివృద్ధి శూన్యమని ఆరోపించారు. నియోజకవర్గంలో పర్యటించకుండా హైదరాబాద్ కే పరిమితం అవుతే ప్రజా సమస్యలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు.

ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలే తప్ప ఎన్నికల్లో డబ్బులు పంచితే ఏమి వస్తుందని ఎద్దేవా చేశారు.

తెలంగాణ సాహిత్య చరిత్రపై మరింత పరిశోధన జరగాలి

– ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్ తదితరులు.

హైదరాబాద్, జూన్ 5 : (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ సాహిత్య చరిత్రపై మరింత పరిశోధన జరగాల్సిన అవసరముందని ఆంధ్రజ్యోతి పత్రిక సంపాదకులు కె.శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో జరిగిన పరిశోధనల్లో ధరణికోట శ్రీనివాసులు వంటి మహా సాహితీవేత్త లు వెలుగులోకి వచ్చారని పేర్కొన్నారు. శనివారం రవీంద్రభారతిలో తెలంగాణ తొలితరం సాహితీవేత్త ధరణికోట శ్రీనివాసులు కథలు పుస్తకావిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన కె. శ్రీనివాస్‌లు పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు.

హైదరా బాద్ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో కలిసిన ప్పుడు బలమైన ప్రవాహం ముందు తెలంగాణ చారిత్రక సాహిత్యం వెలుగులోకి రాలేకపోయిందని తెలిపారు. తెలంగాణ వికాస ఉద్యమాల్లో ధరణికోట పాత్ర ఉందని, సమాజం గర్వించదిన రచయిత అని కొనియాడారు. విశిష్ట అతిథిగా హాజరైన ప్రముఖ సాహితీవేత్త సుంకిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో ఘనమైన సాహిత్యం దాగి ఉందన్నారు. ధరణికోట చక్కటి భాష, చలోక్తులతో కథలు రచించారని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన సంగిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ మరుగున పడిన తెలంగాణ కథలను వెలుగులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గోనారెడ్డి, అంబటి వెంకన్న, ఏలికట్ట శంకరరావు, సంపత్‌కుమార్, సీతమ్మలతో పాటు ధరణికోట శ్రీనివాసులు కుటుంసభ్యులు పాల్గొన్నారు.

త్యాగరాయగానసభ వ్యవస్థాపక వేడుకలు

సంయుక్త మంజులతో పాటు వారి శిష్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి, జనార్దనమూర్తి

హైదరాబాద్, జూన్ 5 : (నేటినిజం ప్రతినిధి): చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభ 58వ వ్యవస్థాపక వేడుకలు సోమవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్సీ మధుసూదనాచారి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గానసభ శాస్త్రీయ కళలకు ప్రాధాన్యత ఇస్తోందని యువతను ఆకట్టుకునే ప్రయత్నం చేయాలని కోరారు. రెండు తెలుగు రాష్ట్రాలలో గానసభ ప్రాచుర్యం పొందిందని ఐదున్నర దశాబ్దాలకు పైగా పలు సాంస్కృతిక కార్యక్రమాలకు వేదిక కల్పిస్తూ నిర్వాహకులు గానసభ ప్రతిష్టను కాపాడుతున్నారని అభినందించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ గానసభ 58 ఏళ్ల ప్రయాణంలో ప్రఖ్యాత సంగీత నృత్య నాటక కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారని గుర్తు చేసుకున్నారు. రెండు రోజుల పాటు వ్యవస్థాపక వేడుక జరుపుతున్నామని తెలిపారు. గానసభ సంగీత గురువు సంయుక్త శిష్యబృందం రాగరమ్య ఫైన్ ఆర్ట్స్ మంజుల శిష్య బృందం శాస్త్రీయ గాన గోష్ఠి శ్రోతలను ఆకట్టుకుంది.

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు

అడ్మిన్: రమాదేవి కులకర్ణి 8985613123

నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ

అంక్షల పయనం

అందరూ బంధువులే
ఆపదొస్తే బహుదూరాలే
అన్వేషణలో భాగమై
ఆలోచనలో అంతరంగమై
ఆశయంలో ఆంతరగమై
ఉరుకుల పరుగుల జీవితం
అంతా ఆంక్షల పయనం.
కాలం గీసిన గీత మారి
చలనం లేని బండగ మారి
కనిపించని చీకటి కోణాలు
కనిపించే భావనా వీచికలు
అగుపించే ఊహా చిత్రాలు
ఆగుపించని స్వప్న గీతాలు
అంతా భ్రమల వ్యాపకం.
ప్రతి కూల పరిస్థితులు
అనుకూల ఆలోచనలు
సమాలోచనలో సంజ్ఞలు
సమయం లేని సఖ్యతలు
ఎవరికి వారే పరుగులు
కదలికల విహంగ వీక్షణలు
అంతా మార్పుల కాలం.
ఆలోచన చేసే అవకాశం
నిలకడలేని నిజ రూపం
అలజడిరేగి అనునిత్యం
నిలబడలేని మనిషి తత్వం
సమయం వెచ్చించని కాలం
సమస్యల కొత్త తోరణం
కానరాని అంక్షల పయనం.

-షేక్ రహీమ్ సాహెబ్
7330939773

ఆలోచనల దారిలో

అడుగు పడాలంటే
ఆలోచనల.....
చినుకులు రాలాల్సిందే
భవిష్యత్తు నేలతడిసి
సుఖ శాంతుల మొక్క
చేతులు చాచుకొని
రంగులద్దుకొన్న కుసుమాలూ
నవ్వుతు ఆహ్వానిస్తున్నాయి.
పెద్దలు నడిచిన దారి
నవతరానికి
ఆలోచనల దారైనప్పుడు
యువతరం రేపటి చీకటిని
తరిమేసే వెలుగు కిరణాలై
మెరుస్తారు.
స్వయం ఉపాదికి సైరనూదితే
సోమరితనం
ఒంటరి పక్షిలామారి
ఆసరాదొరకని బాటసారికి
బంధువులా వచ్చే విశ్వాసం
విజయకేతనం ఎగురవేస్తుంది
సృష్టిలోని ప్రతిసృష్టికి
యోజన చేసే యోధులైనప్పుడు
ప్రయోజనం బడుగులకు అంది
అడుగులు ఆకాశాన్ని
అందుకునే వైపు నడుస్తాయి.

-డా.బి.సుధాకర్

వజ్రాల పంట

అలసటెరగని అలలులా..
మనోసంద్రంలో
ఆలోచనలు జనిస్తున్నప్పుడు..
చిన్న గులకరాళ్ళ చప్పుళ్ళకే
వణికిపోతే ఎలా?
ప్రపంచాన్నే కానరాకుండా
చుట్టే నిశీధిపొరలనే
నిత్యం నూతనోత్తేజంతో
సూర్యకిరణాలు
రెక్కలు విప్పి
రంగులు పూసుకున్న
సీతాకోక చిలుకల్లా ఎగురుకుంటూ..
భువిని చైతన్య వంతంగా
అభిషేకం చేస్తుంటే..
గమ్యాన్ని చేరుకోవడానికి..
ఆలోచనలకు ఆనకట్ట కట్టుకుని
వెనుకడుగు వేయటానికి
సిద్ధపడతావెందుకు?
అవరోధాలు
కఠిన శిలలై ఎదురైనప్పుడు
ఉప్పెనలా ఎగిసిపడి
కరిగించి బుద్ధితో బాట వేయ్
ఎందుకు చేరలేవు గమ్యాన్ని?
నీలో ఆశ ఉన్నతమైనదైతే
ఎదురై ఎదారిలో కూడ
జలాశయాలు ఏర్పరచగలవు..
చరిత్రలు తిప్పి చూడు ..
ఆలోచనల దారిలో
పలకరించే ఆటంకాలను
చిరునవ్వుతో దాటి
జీవితాలను అందంగా
మలుచుకున్నారో..
అవగతమై..
వణుకుతున్న బుర్రలో
వజ్రాలపంట
పండించుకోగలవు..
పలువురికి
ఆదర్శంగా నిలుస్తూ..

-శ్రీదేవి సురేష్ కుసుమంచి

భవతారకమంత్రం

అదుపు లేని
చంచలమైన మనసుకు...
అనంతమైన ఆలోచనలు!
కుదురు లేని ఆలోచనలు...
రౌతు మాట వినని గుర్రంలా...
నకారాత్మక డొంక దారుల్లో...
పరుగెడుతుంటే...
గట్టిగా కళ్లెం బిగించి...
నిర్మాణాత్మక, సకారాత్మక
దారిలో పయనించేలా...
ఏకాగ్రతా శిక్షణనిచ్చి...
క్రమపద్ధతిన ఆలోచనల
గుర్రాలను పరుగెత్తేలా
చేసే రౌతే ధ్యానం!
చంచల చిత్తమును
కుదురుగా నిలుపు అభ్యాస
సాధనమే ఏకాగ్రత!
పాఠం మనసు పెట్టి వినడమే
విద్యాజ్ఞానానికి తొలిమెట్టు...
ఏకాగ్రతేగా విద్యను
నేర్చుకునేందుకు ఆయువుపట్టు!
ఏకాగ్రతా చిత్తం,
ఎడతెగని సాధన
సునిశిత దృష్టి,
సహనంతో సృష్టి
కార్య నిమగ్నత, దక్షతల
లక్షణాల సమన్వితమై
సమున్నతంగా సాకారమయ్యే
లలితకళా సృజన రూపాలు
రసనిధికి సోపానాలు!
ధనుర్విద్యకైనా...
వృత్తి విద్యలకైనా!
మునులకైనా...
ఆశయధనులకైనా...
శాస్త్రవేత్తలకైనా...
సాధువుంగవులకైనా...
వంట పనికైనా...
సంగీత సాధనకైనా...
మనోల్లాసాన్ని
అందుకునేందుకు...
మధురానుభూతిని
పొందేందుకు...
ఏకాగ్రతే భవతారకమంత్రం
ఏకాగ్రతే నియమమైతే...
నిద్రలోనూ, మెలకువలోనూ
ఆశయసాధనే గమ్యమైతే...
అసాధ్యం సుసాధ్యమగు!
సమస్యా పరిష్కారం
సులభమగు!
నిశ్చయముగ
విజయం వరించు!

-చంద్రకళ.దీకొండ

రాజేశ్‌కు సకల కళాకిరీటి బిరుదు

రాజేశ్‌ను సకలకళాకిరీటి బిరుదుతో సత్కరిస్తున్న ఆమని, దామోదర్‌గప్తా.

హైదరాబాద్, జూన్ 5 : (నేటినిజం ప్రతినిధి): ఆర్ఆర్ ఫౌండేషన్, ఆదర్శ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం జయంతి వేడుకలు సోమవారం త్యాగరాయ గానసభలో ఉదయం నుంచి రాత్రివరకు ఘనంగా నిర్వహించారు. బాలుతో పాటు పలువురు గాయకులకు స్వర నీరాజనం సమర్పిస్తూ గాయనీ గాయకులు గీతాలు ఆలపించారు. గాయకుడు, సంగీత దర్శకుడు, శివరంజని కల్చరల్ ఆర్గనైజేషన్ అధినేత రాజేశ్‌కు సకల కళాకిరిటీ-2024 బిరుదు ప్రదానంచేసి సన్మానించారు. పోలీస్‌హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గప్తా నవరసగాయని ఆమని తదితరులు పాల్గొని రాజేశ్‌ని సన్మానించి మాట్లాడుతూ కళాకారులు సమాజానికి చాలా అవసరమని వారిని సరైన గుర్తింపుతో ఉత్సాహపరిస్తే ఇంకా ఎన్నో అద్భుతాలు వారినుంచి పొందవచ్చన్నారు. ఎస్‌బీఐ మాజీ ఏజీఎం త్రినాథరావు, సంఘసేవకులు కె. భాస్కర్, నాదస్వర విద్వాంసులు హుస్సేన్, గాయనీగాయకులు సుభాష్, శిరీష, శ్రీనివాస్‌రావు, శ్వేత తదితరులు పాల్గొన్నారు.


ఆహ్వానం
నెలపొడుపు
సాహిత్య సాంస్కృతిక వేదిక
Regd No. 288/2019
మరియు
తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ
సంయుక్త ఆధ్వర్యంలో
ధిక్కార
మహాత్మా పూలే స్ఫూర్తి కవిత్వం ఆవిష్కరణ
తేది: 08.06.2024 శనివారం, ఉ. 10 గం.లకు
రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాలే, హైదరాబాద్.
ఆహ్వానం : ఏ. వహీద్ ఖాన్ గారు
కవి, కథకులు
సభాధ్యక్షులు : డా. సంగిశెట్టి శ్రీనివాస్ గారు
సాహిత్య విమర్శకులు, చరిత్ర కారులు
ముఖ్య అతిథి మరియు పుస్తక ఆవిష్కర్త :
బుర్ర వెంకటేశం గారు IAS
విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి తెలంగాణ ప్రభుత్వం
విశిష్ట అతిథులు : గోరటి వెంకన్న గారు
MLC, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత
జూలూరు గౌరీ శంకర్ గారు
మాజీ అధ్యక్షులు తెలంగాణ సాహిత్య అకాడమీ
జి. లక్ష్మీనరసయ్య గారు
కవి, విమర్శకులు
డా. మామిడి హరికృష్ణ గారు
సంచాలకులు, భాషా సాంస్కృతిక శాఖ తెలంగాణ ప్రభుత్వం
డా.జి. ప్రసాదమూర్తి గారు
కవి, విమర్శకులు
డా.ఏ. జయంతి గారు
విశ్రాంత అధ్యాపకులు, కవి, రచయిత్రి
డా. పసునూరి రవీందర్ గారు
కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత
సంపాదకుల తరుపున స్వాగత :
వనపట్ల సుబ్బయ్య గారు
కవి, రచయిత
వందన సమర్పణ : ఆమ్ గోత్ వెంకట్ పవార్ గారు
కవి, రచయిత
నిర్వహణ : కందికొండ మోహన్, కల్వకోలే మల్ల